ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

భద్రాద్రి కొత్తగూడెం

BHADRADRI KOTHAGUDEM

గురువారం, 12 సెప్టెంబరు 2024



కనీవినీ ఎరుగని నష్టం

- ప్రభుత్వం సాయం చేస్తేనే బతుకు ముందుకు
- జిల్లాలో వరద నష్టం రూ.729.68 కోట్లు
- మున్నేరు దెబ్బకు రూ.100 కోట్లు ఫట్
- కేంద్ర బృందంపైనే బాధితుల ఆశలు

6



ఏమో ఏమోనో..

రక్షణ గోడలు రీడిజైన్ చేస్తారా!?

- వరదల నేపథ్యంలో ఖమ్మంలో మున్నేరు కాంక్రీట్‌వాల్ ప్రశ్నార్థకం
- గతంలో వరదకు అనుగుణంగా 33 అడుగులు డిజైన్
- ప్రస్తుతం 36.9 అడుగులకు పైగా వరద ముంపు
- నదీ తీరం పొడవునా.. నిర్మిస్తేనే ఫలితం
- నిపుణుల కమిటీ ఇచ్చే నివేదికపైనే ఆధారం

ఖమ్మం నగరాన్ని అతలాకుతలం చేసిన మున్నేరు వరదలను ముందు అడ్డుకోవడం ఎలా..? అనే ప్రశ్న అందరినీ తొలచి వేస్తోంది. గతేడాది మున్నేరుకు ఇదేరకమైన వరదలు వచ్చిన సందర్భంలో ఖమ్మం నగరం ముంపునకు గురవకుండా ఉండేందుకు పరిష్కారంలో భాగంగా యేరుకు ఇరువైపులా కాంక్రీట్ రిటైనింగ్ వాల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందుకోసం రూ. 690 కోట్లను సైతం కేటాయించారు. అయితే ప్రస్తుతం వచ్చిన వరదల నేపథ్యంలో రక్షణ గోడల నిర్మాణంపై చర్చ జరుగుతోంది. గతంలో వచ్చిన వరదల నేపథ్యంలో మున్నేరు కాంక్రీట్ వాల్స్ డిజైన్ చేయగా, ప్రస్తుతం అంతకుమించిన వరదలు రావడంతో దానికి తగినవిధంగా మళ్లీ డిజైన్ చేస్తారా? లేక పాత డిజైన్‌నే కొనసాగిస్తారా? అన్న ప్రశ్న తలెత్తుతోంది.

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం

6



నమూనా చిత్రం



మున్నేరు చెంతన నిర్మాణంలో ఉన్న రక్షణ గోడలు



ఖమ్మం రూరల్ మండలంలో రైతుతో మాట్లాడుతున్న దృశ్యం



తిరుమలాయపాలెం మండలంలో కేంద్ర బృందాన్ని ఆదుకోమ్మని వేడుకుంటున్న ఓ మహిళా రైతు

సర్వం కోల్పోయాం ఆదుకోండి

- సాగులో ఉన్న పంటలు కొట్టుకుపోయాయి..
- పొలాల నిండా ఇసుక మేటలు వేశాయి...
- పెట్టుబడులతోపాటు ఇళ్లనూ కోల్పోయాం..
- పరిహారం ఇచ్చి ఆదుకోవాలి
- కేంద్ర బృందం ఎదుట బాధిత రైతుల గోడు
- పాలేరు నియోజకవర్గంలో పర్యటించిన బృందం
- దెబ్బతిన్న పంటలు, ఇళ్లు, రహదారుల పరిశీలన
- గండ్లు పడిన సాగర్ కాల్వను కూడా...
- నష్ట తీవ్రతను వివరించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కూసుమంచి/తిరుమలాయపాలెం/ఖమ్మంరూరల్, సెప్టెంబరు 11: అకాల వర్షాలు, వరదలతో దెబ్బతిన్న పంటలను, రోడ్లను కేంద్ర ప్రతినిధి బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. పంటలను, ఆస్తులను కోల్పోయి తాము రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదుకోవాలని వేడుకున్నారు. మొత్తం ఆరుగురు సభ్యులతో వచ్చిన కేంద్ర బృందం రెండు బృందాలుగా పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం మండలాల్లో పర్యటించారు. వర్షాలు, వరదలతో జరిగిన నష్టాన్ని పరిశీలించారు. కల్నల్ కీర్తిప్రతాప్‌సింగ్, మహేష్‌కుమార్, శాంతినాథ్ శివప్ప, ఎస్‌కే కుషవహ, టి.నియాల్‌ఖాహోన్సన్, శశివర్ధన్‌రెడ్డితో కూడిన బృందం ముగ్గురు చొప్పున విడిపోయి పర్యటించారు. వారితోపాటు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

కూసుమంచి మండలంలోని నాయకన్‌గూడెం వద్ద దెబ్బతిన్న ఖమ్మం-సూర్యాపేట జాతీయరహదారిని కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. అక్కడే భగత్‌వీడువద్ద దెబ్బతిన్న పంటలను, ఇసుకమేటలను పరిశీలించారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బృందానికి వరద బీభత్సం, పంటనష్టం గురించి వివరించారు. నష్టపోయిన రైతులతో బృందం సభ్యులు మాట్లాడారు. రైతులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ ఇంతస్థాయిలో వరదలు, వర్షాలు రాలేదన్నారు. సాగుచేసిన వరి, మిర్చి, పత్తి పంటలు నీటమునిగాయన్నారు. ఇళ్లలోకి వరద రావడంతో ఖాళీచేయాల్సి వచ్చిందని, పశువులు సైతం మృత్యువాత పడ్డాయని తెలిపారు. అపారనష్టం సంభవించిందని తెలిపారు. రహదారులు కొట్టుకుపోయాయని వివరించారు. జరిగిన నష్టాన్ని ప్రభుత్వానికి నివేదించి తగిన సాయం అందేలా చూడాలని వేడుకున్నారు. అక్కడినుంచి బృందం పాలేరు జలాశయం వద్ద సాగర్ ఎడమకాల్వకు పడిన గండిని పరిశీలించారు. అక్కడ ఐబీ అధికారుల ఫొటో ఎగ్జిబిషన్ తిలకించారు. అక్కడినుంచి నానుతండాలో మునిగిన పంటలను పరిశీలించారు. ఎర్రగడ్డతండాలో భక్త రామదాసు ప్రాజెక్టును పరిశీలించారు. జరిగిన నష్టాన్ని కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు.

రాకాసితండాలో...

వరద బీభత్సంతో సర్వం కోల్పోయిన తిరుమలాయపాలెం మండలంలోని రాకాసి తండాలో కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. వరద వచ్చిన తీరుతెన్నులపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థులు కేంద్ర బృందం ఎదుట బోరున విలపించారు. ఆకేరు వరద ఒక్కసారి వచ్చి ఊరును చుట్టుముట్టడంతో బయటకు వెళ్లామని తెలిపారు. వరద ప్రవాహానికి ఇంటిలోని (మిగతా 6వ పేజీలో)



కూసుమంచి మండలం పాలేరు వద్ద సాగర్‌కాల్వకు గండ్లు పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

నేడు నగరంలో కేంద్ర బృందం పర్యటన

మున్నేరు వరద ప్రాంతాల పరిశీలన

ఖమ్మం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మున్నేరు పరివాహక ప్రాంతంతోపాటు భారీవర్షాలు, వరదల కారణంగా ఖమ్మం నగరంలో జరిగిన నష్టాన్ని కేంద్ర బృందం గురువారం పరిశీలించనుంది. కేంద్రం నుంచి వచ్చిన కల్నల్ కీర్తిప్రతాప్‌సింగ్, మహేష్‌కుమార్, శాంతినాథ్ శివప్ప, ఎస్‌కే కుషవహ, టి.నియాల్‌ఖాహోన్సన్, శశివర్ధన్‌రెడ్డి, రాష్ట్ర విపత్తుల నివారణ చీఫ్ సెక్రటరీ అరవిందకుమార్‌తోపాటు రాష్ట్ర ఉన్నతాధికారులు సురేంద్రమోహన్, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, ఖమ్మం కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటనలో పాలుపంచుకోనున్నారు. ఖమ్మంలోని బొక్కలగడ్డ, కాల్వొడ్డు, మోతీనగర్, పద్మావతినగర్, ధంసలాపురం తదితర కాలనీల్లో పర్యటించి వరద కారణంగా పడిపోయిన ఇళ్లను, నష్టాన్ని బాధితుల నుంచి అడిగి తెలుసుకోనున్నారు. అనంతరం అధికారులతో సమీక్షించే అవకాశం ఉంది. జిల్లాలో జరిగిన వరద నష్టంపైనా అధికారులతో కేంద్ర బృందం సమీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా యంత్రాంగం ఫొటో ఎగ్జిబిషన్‌తోపాటు నివేదికలు సిద్ధం చేశారు.

మరణంలోనూ వీడని బంధం

- భార్య మృతి.. విషయం తెలుసుకొని భర్త హఠాన్మరణం
- బోనకల్‌లో విషాదం



సుందరమ్మ, అన్నమయ్య (ఫైల్)

బోనకల్, సెప్టెంబరు 11: ఆ ఇద్దరిది డెబ్బై ఏళ్ల వివాహ బంధం. అన్యోన్య దాంపత్య జీవనం వారిది. ఆఖరి మజిలీలో వారి బంధం విడదీయరానిదిగా మారింది. భార్య కన్నుమూతతో గంటల వ్యవధిలోనే భర్త కూడా గుండె పగిలి చనిపోయాడు. మరణంలోనూ వారిద్దరి బంధం తోడుగా వెళ్లిపోవడంతో ప్రజలు చలించిపోయారు. వివరాల్లోకి వెళ్తే... ఖమ్మం జిల్లా బోనకల్ మండల కేంద్రానికి చెందిన నందమూరి అన్నమయ్య(90), సుందరమ్మ(84) దంపతులకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు. రైతు కుటుంబ నేపథ్యం కావడంతో దంపతులు కష్టపడి పిల్లలను చదివించి, పెళ్లిళ్లు చేసి బాధ్యతలను తీర్చుకున్నారు. వ్యవసాయ పనులతోపాటు దైవ దర్శనాలు, శుభకార్యాలకు, ఇంకా ఎక్కడికైనా ఇద్దరూ కలిసే వెళ్లేవారు. చివరివరకు తోడునీడగా జీవనం సాగించారు. అయితే కొన్ని రోజుల క్రితం అస్వస్థతకు లోను కావడంతో ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి బుధవారం ఉదయం భార్య సుందరమ్మ మృతిచెందింది. కొన్ని గంటల వ్యవధిలో భార్య మరణ వార్తను కుమార్తె ద్వారా తెలుసుకున్న అన్నమయ్య కూడా గుండెపోటుకు గురై మృతిచెందాడు. అన్నమయ్య కుమారుడు నర్సింహారావు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఖమ్మంలో స్థిరపడ్డారు. కాగా, దంపతుల అంత్యక్రియలు గురువారం గ్రామంలో జరగనున్నాయి.

వైద్య కళాశాలకు శరీరదానం



సత్తుపల్లి రూరల్, సెప్టెంబరు 11: అకాల మరణం పొందిన తండ్రి పార్థివ శరీరాన్ని ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అప్పగించారు ఆయన కుమార్తెలు. సత్తుపల్లి పట్టణం జలగం నగర్‌కు చెందిన సత్తెనపల్లి వీరభద్రాచారి(80) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. మరణించిన తర్వాత కూడా ఉపయోగపడాలనే ఉద్దేశంతో భౌతిక కాయాన్ని దహనం చేయకుండా వైద్య విద్యార్థులకు కోసం కళాశాలకు అప్పగించాలని భార్య శేషకుమారి, కుమార్తెలు రామడుగు అరుణకుమారి, సత్తెనపల్లి సుశీల, ఆదిమూలం సుగుణ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలకు తీసుకువెళ్లి అప్పగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అనాటమీ హెడ్ డాక్టర్ దాసరి చంద్రప్రియ, డాక్టర్ అశోక్, లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తుపల్లి, ఖమ్మం నేత్రనిధి బృందం బాధ్యులు చిలుకపాటి హనుమంతరావు, పగడాల నాగేశ్వరరావు, పీ.హరిప్రసాద్, ఎల్.ప్రవీణ్, ఎం.నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గోవుల తరలింపును అడ్డుకున్న బీజేపీ

- పాల్వంచలో డ్రైవర్ సహా ట్రాలీ పోలీసులకు అప్పగింత

7

రూ.లక్ష చొప్పున పరిహారం చెల్లించాలి..

సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర నేతల డిమాండ్ 7

7,575 మందికి రూ.12.5 కోట్లు జమ

మున్నేరు వరద బాధితులకు అందుతున్న సాయం 6

అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయండి

కలెక్టర్‌కు ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సూచన



కొత్తగూడెంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

డబ్బుతో ఓట్లు పడవు

- ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకుంటేనే భవిష్యత్తు
- ఖమ్మం జిల్లాలో కమ్యూనిస్టులను ప్రజలు పక్కన పెట్టారు
- బీజేపీ నేత, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

6

అధికారుల పనితీరు భేష్

- సమన్వయంతో వరద గండం తప్పించారు..
- రహదారుల ఎత్తు పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- ఆ ఐదు పంచాయతీలతోనే భద్రాద్రి అభివృద్ధికి వెసులుబాటు
- గోదావరి వరదల నేపథ్యంలో మంత్రి తుమ్మల సమీక్ష
- భద్రాచలం వద్ద గోదావరి వరద పరిస్థితి, కరకట్ట పరిశీలన

భద్రాచలం, సెప్టెంబరు 11: ఈసారి గోదావరి వరద తుది ప్రమాద హెచ్చరికకు చేరువగా వచ్చినా ఎటువంటి ప్రాణ నష్టం లేకుండా జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేసిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రశంసించారు. గోదావరి వరదల నేపథ్యంలో బుధవారం భద్రాచలంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వరద సహాయక చర్యలు, తదితర అంశాలపై మంత్రి తుమ్మల సమీక్షించారు. భద్రాచలం వద్ద గోదావరి తుది ప్రమాదహెచ్చరిక (53 అడుగులు) దాటినా భద్రాచలం నుంచి వాజేడు వరకు రాకపోకలకు అంతరాయం లేకుండా అవసరమైన చోట రోడ్డు ఎత్తు పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు.

సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ముందస్తు జాగ్రత్తలు తీసుకొని రూ.40కోట్లతో మిగిలిపోయిన కరకట్ట నిర్మాణం చేపట్టడంతో భద్రాచలం పట్టణంలోని కాలనీలకు వరద ముంపు లేకుండా చేశామన్నారు. భవిష్యత్తులో గోదావరి వరద గండం లేకుండా శాశ్వత ప్రాతిపదికన కరకట్ట వద్ద (మిగతా 6వ పేజీలో)



భద్రాచలంలో పర్యటిస్తున్న మంత్రి తుమ్మల

గోదావరి తగ్గుముఖం

కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక 6

వెంగళరావుసాగర్ కుడి కాలువకు భారీ గండి

» వృథాగా పోతున్న నీరు » ఖాళీ అవుతున్న ప్రాజెక్టు

చంద్రుగొండ, సెప్టెంబరు 11: మండల పరిధిలోని వెంగళరావుసాగర్ కుడి కాలువకు బుధవారం గండి పడి ప్రాజెక్టులోని నీరు భారీగా బయటకు పోతుంది. గత పదిరోజు పాటు ఎడతెరిపి లేని వర్షాలకు ప్రాజెక్టులోని భారీగా వరద చేరింది. నీరు వృథాగా పోతుండటంతో ప్రాజెక్టు పూర్తిగా ఖాళీ అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇది ఇలా ఉండగా గత ఐదు సంవత్సరాల క్రితం కురిసిన భారీ వానలకు ప్రాజెక్టు అలుగు పూర్తిగా కొట్టుకు పోయింది. అప్పటి నుంచి అధికారులు తాత్కాలిక చర్యలతో ప్రాజెక్టులో కొంత మేర నీటిని నిల్వ చేయగలుగుతున్నారు. కాగా అలుగు నీరు వెళ్లేందుకు కుడి కాలువను అనుకొని మరో భారీ కాలువను తవ్వారు. ఆ కాలువ క్రమేపీ కోతకు గురై వరద కుడి కాలువపై పడింది. దీంతో కుడి కాలువకు సైతం భారీ గండిపడి నీరు బయటకు వెళ్లి పోతోంది. నీటి పారుదల ఈఈ అర్జున్, డీఈ కృష్ణశంకర్ గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. వరద ఉధృతి తగ్గితేనే గండి పూడ్చే అవకాశం ఉంటుందని ఈఈ తెలిపారు.

ప్రశ్నార్థకంగా వేలాది ఎకరాల్లోని పంట

ప్రత్యక్షంగా 2200, పరోక్షంగా మరో వేయి ఎకరాలకు సాగునీరు అందిస్తున్న ప్రాజెక్టు అలుగుపూర్తిగా ధ్వంసమవటంతో గత ఐదేళ్లుగా ఆయకట్టు కు పూర్తిస్థాయిలో నీరందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమయంలో అత్యధిక భూమికి నీరు అందిచే కాలువ పూర్తిగా కొట్టుకు పో వటంతో పంట ప్రశ్నార్థకంగా మారిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.



గండి పడిన ప్రదేశాని పరిశీలిస్తున్న ఈఈ, డీఈ

సమాజం కోసం అటవీశాఖలో విధులు

» సాంకేతికతను వినియోగించి రక్షణ పొందాలి
» అడవిపై ఆధారపడిన ప్రజలకు ప్రత్యామ్నాయం చూపించాలి
» అమరవీరుల దినోత్సవంలో డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్‌సింగ్

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 11: భద్రాద్రి జిల్లాలో ఇప్పటికి 10లక్షల ఎకరాల అటవీ భూమి సంరక్షణలో ఉండగా, ఖమ్మం జిల్లాలో 1.5 లక్షల ఎకరాల భూమి ఉందని, అన్ని ప్రభుత్వశాఖలు ఇప్పటి సమాజం కోసం పనిచేస్తే అటవీశాఖ మాత్రం మరో వందేళ్ల భవిష్యత్ సమాజం కోసం పనిచేస్తోందని, అటవీశాఖలో పనిచేసే అధికారులు, ఉద్యోగులు సాంకేతికతను ఉపయోగించుకొని రక్షణ పొందాలని, బలమైన కేసుల్ని నమోదు చేసేందుకు సాంకేతిక విజ్ఞానం ఉపయోగపడుతుందని జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ పిలుపునిచ్చారు. బుధవారం ఖమ్మం అటవీ శాఖ కార్యాలయంలో పర్యవేక్షకుడు సత్యనారాయణ అధ్యక్షతన అటవీశాఖ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీశాఖ ఉద్యోగులు ఒక్కొక్కరూ మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో వారు ఎదుర్కొంటున్న దాడులను వివరించారు. అటవీశాఖ ఆదేశాల మేరకు మంచిగా పనిచేసే ఉద్యోగులపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీసారి పోలీసుల సహాయం తీసుకొనే వీలు ఉండదని, అటవీభూముల ఆక్రమణల సందర్భంగా కొంతమంది అటవీశాఖ ఉద్యోగులపై రాళ్ల దాడి చేస్తున్నారని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో సిద్ధార్థవిక్రమ్‌సింగ్ మాట్లాడుతూ రఘునాథపాలెం మండలం ఈర్లపూడికి చెందిన ఎఫ్‌ఆర్వో శ్రీనివాసరావు హత్య జరిగిన రోజు సంఘటనను వివరించారు. శ్రీనివాసరావు హత్య జరిగిన తర్వాత అటవీశాఖ ఉద్యోగులు డిమాండ్లు ప్రభుత్వానికి చేరాయని, అధికారులు, ఉద్యోగులు అధైర్యపడొద్దని మంచిగా పనిచేసే వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో మంజుల, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్‌సింగ్

జేవీఆర్ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

సత్తుపల్లి, సెప్టెంబరు 11: సత్తుపల్లి పట్టణంలోని జలగం వెంగళరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో గణితశాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ బీ వెంకటేశ్వరావుకు బుధవారం కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. 'స్టడీస్ ఆఫ్ వేవ్ ప్రోపగేషన్ ప్రాబ్లమ్ ఇన్ ఎలాస్టిక్ సాలిడ్స్' అనే అంశంపై డాక్టర్ కే.సోమయ్య పర్యవేక్షణలో సిద్ధాంత గ్రంథాన్ని వెంకటేశ్వరరావు విశ్వవిద్యాలయంలో సమర్పించారు. పనిచేస్తున్న కళాశాలలోనే చదువుకున్న వెంకటేశ్వరరావు గ్రామీణ ప్రాంతంలో పుట్టి పెరిగి ప్రభుత్వ విద్యాసంస్థలలోనే విద్యనభ్యసించి పట్టుదలతో డాక్టరేట్ సాధించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.గోపి, తోటి అధ్యాపకులు అభినందనలు తెలియజేస్తూ ఘనంగా సన్మానించారు.



అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకటేశ్వరావు

రావినూతల-పొద్దుటూరు రహదారికి మహర్దశ

భట్టికి కృతజ్ఞతలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

బోనకల్, సెప్టెంబరు 11: మండలంలోని రావినూతల గ్రామం నుంచి చింతకాని మండలం పొద్దుటూరు గ్రామం వరకు గల 11 కిలోమీటర్ల రహదారిని విస్తరించేందుకు గానూ రూ. 26 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు ఈ మార్గం సింగిల్ రోడ్డు కావడంతో ప్రమాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిదిలోని లక్ష్మీపురం, గోవిందాపురం(ఎల్) గ్రామాలలో ఇంటిగ్రేటెడ్, ఇంటర్నేషనల్ పాఠశాలల సముదాయాలు నిర్మించేందుకు సన్నాహకాలు జరుగుతున్నాయి. ఇందులో బాగంగా రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు కావడంతో ఈ రహదారికి మహర్దశ చేకూరనుంది. రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టీ విక్రమార్కకు పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్ కుమార్, మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, నాయకులు చేబ్రోలు వెంకటేశ్వర్లు, పిల్లలమర్రి నాగేశ్వరావు, ఎర్రంశెట్టి సుబ్బారావులు కృతజ్ఞతలు తెలిపారు.



నిధులు మంజూరైన రోడ్డు ఇదే..

దెబ్బతిన్న భూములకు ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలి

» సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

ఖమ్మం రూరల్, సెప్టెంబరు 11: జిల్లాలో వర్షం, వరద ప్రభావంతో జిల్లాలోని ఆకేరు, మున్నేరు, బుగ్గవాగు, వైరా, పాలేరు, పగిడేరు వాగులు, ఏర్లు సృష్టించిన బీభత్సానికి ఖమ్మం జిల్లాలో 75 వేల ఎకరాల్లో వరి, పత్తి, మిర్చి, అనేక రకాల పంటలు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని వాల్యాతండాలో దెబ్బతిన్న పంటలను, మేట వేసిన భూములను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం, వరద సృష్టించిన బీభత్సానికి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. విద్యుత్ మోటార్లు, డ్రిప్పులు వరదలో కొట్టుకుపోయాయన్నారు. ప్రభుత్వం రైతులకు వాటిని అందించాలని డిమాండ్ చేశారు. దెబ్బతిన్న భూములకు ఎకరానికి రూ.50వేలు నష్టపరిహారం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ.25వేలు అందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ విపత్తుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలన్నారు. జిల్లాలో కేవలం 30శాతమే రుణమాఫీ అమలైందన్నారు. రైతు భరోసా ఇవ్వకపోగా రుణమాఫీ పూర్తిగా అమలు చేయకపోగా వ్యవసాయం చేస్తున్న రైతులకు మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్లు వరద రూపంలో రైతుల భూములు, పంటలు దెబ్బతినడంతో రైతుల భవిష్యత్తు అగమ్యగోచరమైందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు నష్టపరిహారం, రైతు రుణమాఫీ, రైతు భరోసా వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో రైతులను సమీకరించి మంత్రులు, ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలు, కలెక్టరేట్‌లు ముట్టడిస్తామని హెచ్చరించారు.



వరదకు కొట్టుకుపోయిన పంటలను పరిశీలిస్తున్న నున్నా

ఉమ్మడి జిల్లాస్థాయి ఖోఖో జట్ల ఎంపికలు

కల్లూరు, సెప్టెంబరు 11: కల్లూరులో బుధవారం జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలో జిల్లాస్థాయి బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. ఈ క్రీడలకుగాను ఉమ్మడి జిల్లా నుంచి 415మంది ఖోఖో క్రీడాకారులు తరలిరాగా వారిలో ప్రతిభను కనబరిచిన క్రీడాకారుల్లో బాల, బాలికల విభాగం నుంచి 30మంది క్రీడాకారుల జట్లను ఎంపిక చేశారు. వారందరికీ పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు తరుపున భోజన వసతి కల్పించారు. ఈ క్రీడ నిర్వహణకు గాను ఉమ్మడి జిల్లా నుంచి 50మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొని ఈ జట్లను ఎంపిక చేశారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు హైదరాబాద్ మౌలాలిలో జరగనున్న 34వ తెలంగాణ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనటానికి పై విధంగా జట్లను ఎంపిక చేశారు. వారందరికీ పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు తరుపున పొంగులేటి మాధురి క్రీడాకారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఖోఖో అసోసియేషన్ బాధ్యులు పీ.వీరరాఘవయ్య, జాయింట్ సెక్రటరీ

క్రీడాకారులకు పీఎస్ఆర్ ట్రస్టు చేయూత...

పి.నరసయ్య, మహిళ విభాగం ఇన్‌చార్జ్ రమాదేవి, ఏజెన్సీ ఏరియా ఇన్‌చార్జ్‌లు ఎస్‌రామారావు, ఎస్‌ప్రసాద్, బి కృష్ణ, పవన్‌కుమార్ ఎంపికల కన్వీనర్ పాఠశాల హెచ్ఎం నివేదిత పాల్గొన్నారు.



ఎంపికైన బాలికలజట్టు



వంటశాలను పరిశీలిస్తున్న పీవో

నర్సింగ్ విద్యార్థులకు శాశ్వత వసతి సౌకర్యం కల్పిస్తాం

ఐటీడీఏ పీవో బి.రాహుల్

భద్రాచలం, సెప్టెంబరు 11: గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీఎంహెచ్ వసతి గృహం విద్యార్థులకు, నర్సింగ్ కళాశాలలో శిక్షణ పొందుతున్న నర్సింగ్ విద్యార్థినులకు శాశ్వతంగా వసతి సౌకర్యాలు కల్పిస్తామని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. బుధవారం పీఎంహెచ్ హాస్టల్‌ను పీవో సందర్శించారు. ఈ సందర్భంగా పరిసరాలను, డైనింగ్ హాళ్లను పరిశీలించారు. అనంతరం పీవో మాట్లాడుతూ విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చూడాలని పిల్లలు సెల్‌ఫోన్లు గాని, మాదక ద్రవ్యాలు వాడకుండా చూడాలన్నారు. త్వరలో హాస్టల్‌కు శాశ్వత భవన నిర్మాణం చేపడతామని అందుకు అవసరమైన స్థలాన్ని గుర్తించాలని ఇంజనీరింగు శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం నర్సింగ్ కళాశాలను సందర్శించారు. ఈ సమయంలో టాయిలెట్లు, బాత్రూంలు తనిఖీ చేశారు. విద్యార్థులను తీసుకెళ్లే అంబులెన్సు మరమ్మతులు చేయిస్తామని అన్నారు. కళాశాలలో విద్యుత్తు సమస్య, లీకేజీలు ఉంటే మరమ్మతులు చేయిస్తామని వంటషెడ్‌ను పరిశీలించారు. విద్యార్థినులు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ తానాజీ, డీఈ హరీష్, టీఏ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రక్షణ గోడలు రీడిజైన్ చేస్తారా!?

» వరదల నేపథ్యంలో ఖమ్మంలో మున్నేరు కాంక్రీట్‌వాల్ ప్రశ్నార్థకం

ఖమ్మం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరాన్ని అతలాకుతలం చేసిన మున్నేరు వరదలను ముందు అడ్డుకోవడం ఎలా.. అనే ప్రశ్న అందరినీ తొలచివేస్తోంది. గతేడాది మున్నేరుకు ఇదేరకమైన వరదలు వచ్చిన సందర్భంలో ఖమ్మం నగరం ముంపుకు గురవకుండా ఉండేందుకు పరిష్కారంలో భాగంగా యేరుకు ఇరువైపులా కాంక్రీట్ రిటైనింగ్ వాల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందుకోసం రూ. 690 కోట్లను సైతం కేటాయించారు. అయితే ప్రస్తుతం వచ్చిన వరదల నేపథ్యంలో రక్షణ గోడల నిర్మాణంపై చర్చ జరుగుతోంది. గతంలో వచ్చిన వరదల నేపథ్యంలో మున్నేరు కాంక్రీట్ వాల్స్ డిజైన్ చేయగా, ప్రస్తుతం అంతకుమించిన వరదలు రావడంతో దానికి తగినవిధంగా మళ్లీ డిజైన్ చేస్తారా? లేక పాత డిజైన్‌నే కొనసాగిస్తారా? అన్న ప్రశ్న తలెత్తుతోంది.

33 అడుగుల ఎత్తు.. 3.3 అడుగుల వెడల్పు...

మునుపెన్నడూ లేనివిధంగా మున్నేరు 36.9 అడుగులు దాటి ప్రవహించడంతో తీరప్రాంతంలో ఉన్న ఖమ్మం నగరంలోని పద్మావతినగర్, వెంకటేశ్వరనగర్, బొక్కలగడ్డ, మోతీనగర్, ప్రకాష్ నగర్, దానవాయిగూడెం, తీరానికి మరోవైపు ఖమ్మం రూరల్ మండలంలోని నాయుడుపేట, టీచర్స్ కాలనీ, కరుణగిరి ప్రాంతాలు పూర్తిగా మునిగిపోయాయి. ఇరువైపులా కిలోమీటరు మేరకు వరద తీవ్రత ఉండటంతో చుట్టుపక్క కాలనీలు కూడా నీటమునిగి బురద మేట వేశాయి. గతేడాది 30.7 అడుగుల ఎత్తులో మున్నేరు వరద ప్రవాహం కొనసాగడంతో అప్పటి వరదను దృష్టిలో ఉంచుకుని మున్నేరు నదీ తీరానికి ఇరువైపులా ఆర్‌సీసీ కాంక్రీట్ వాల్ కట్టాలని నిర్ణయించారు. ఖమ్మం నగరం పరిధి వరకు ఎనిమిది కిలోమీటర్ల మేర 33 అడుగుల ఎత్తులో 3.3 మీటర్ల వెడల్పు ఉండేలా వాల్ నిర్మాణ పనులు చేపట్టారు. అయితే సదరు పనులు నిర్మాణం ప్రారంభం అయిన నెలల వ్యవధిలోనే మున్నేరుపై ఇంత పెద్ద మొత్తంలో వరదలు ముంచెత్తడం, గతంలో లేనివిధంగా అత్యధిక ఎత్తులో నీటి ప్రవాహం రావడంతో నష్టం కూడా తీవ్రస్థాయిలో ఉంది. దాంతోపాటు మున్నేరు నది తీరంపై ప్రస్తుతం నిర్మించబోయే రక్షణగోడలకు రీ డిజైన్ చేయాలన్న వాదన వినిపిస్తోంది. గతంలో ఉన్నదానికి భిన్నంగా ప్రస్తుతం వరదలు పోటెత్తగా.. అంతకుమించిన వరదలు వచ్చినప్పటికీ పరిస్థితులు తట్టుకునేలా వాల్ నిర్మాణం చేపట్టాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

తీరం పొడవునా గోడలు...

మున్నేరు వరంగల్ జిల్లా పాకాల సరస్సు నుంచి మొదలుకుని డోర్నకల్ ఏరుగుండా ఖమ్మం రూరల్ మండలం కామంచికల్ తీర్థాల వద్ద ఉప నది అయిన ఆకేరును కలుపుకుని ఖమ్మం నగరంలోనికి ప్రవేశిస్తుంది. నగరంలోని రామన్నపేట, మంచికంటినగర్, కాల్వొడ్డు, మోతీనగర్, ప్రకాష్ నగర్, ధంసలాపురంల మీదుగా 13 కిలోమీటర్లు ప్రయాణించి ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా మీదుగా పులిచింతలకు దిగువున 20 కీమీ వద్ద నందిగామ సమీపంలోని ఏటూరు వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది. అయితే ప్రస్తుతం ఏర్పడిన వరదలు ఎగువున ఉన్న మహబూబాబాద్ జిల్లాలో కురిసిన వర్షాలకు తోడు ఖమ్మం జిల్లాలో సగటున 41.23 సెం.మీ వర్షపాతం నమోదు కాగా ఖమ్మం అర్బన్ ప్రాంతంలో 15.34 సెంమీ వర్షపాతం నమోదైంది. దాంతో మున్నేరుకు వరద తీవ్రత పెరిగింది. మున్నేరుకు ఎంతటిస్థాయిలో వరద వచ్చినప్పటికీ ఖమ్మం నగరం ముంపుకు గురికాకుండా ఉండాలంటే ఖమ్మంలో వర్షం కురిసిన సమయంలో ఆ వరద నీటిని మున్నేరులో కలిసే విధంగా కాంక్రీట్ వాల్‌ను డిజైన్ చేయాల్సి ఉంది. కాగా గతంలో డిజైన్ చేసిన రక్షణ గోడను 8 కిలోమీటర్ల మేర మాత్రమే నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయగా.. ఖమ్మం నగరానికి అనుకుని మున్నేరు ప్రవహిస్తున్న తీరం మొత్తం కూడా ఆ రక్షణ గోడను నిర్మిస్తే ముంపునుంచి బయటపడే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. లేనిపక్షంలో గోడకు ముందు, వెనుక ఉన్న ప్రాంతాలు మునిగి, మిగిలిన కాలనీలకు సైతం ఆ వరద వ్యాపించే అవకాశం ఉన్నట్టుగా స్పష్టమవుతోంది. ఆయా అంశాలను దృష్టిలో ఉంచుకుని రక్షణగోడలను రీడిజైన్ చేయాలన్న వాదన వినిపిస్తోంది.

వర్షం, వరద ఒకేసారి వచ్చినా..

వర్షం వల్ల ఖమ్మంలో తలెత్తే వరదను నేరుగా మున్నేరుకు కలపాలి అంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. దాంతో ప్రస్తుతం మున్నేరు కాంక్రీట్ వాల్‌కు అనుసంధానంగా 14 నుంచి 20 మీటర్ల డ్రెయినేజీలను నిర్మించాలని ప్రతిపాదనలు పంపించారు. ఆయా ప్రతిపాదనల ప్రకారం ఇటీవల వరదలకు మునిగిన ప్రకాష్‌నగర్ చప్టా దాటిన తర్వాత నగరంలోని వరద నీరు మున్నేరులో కలిసేలా డిజైన్ చేశారు. అక్కడ కలిపితే మున్నేరుకు వరదలు వచ్చిన సందర్భంలో నీరు తిరిగి ఖమ్మం నగరం మీద ప్రభావం చూపే అవకాశం ఉన్నట్టు పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి ఖమ్మం నగరంలో మున్నేరు నదీ ప్రవాహం కొనసాగుతున్నంత దూరం కూడా కాంక్రీట్ వాల్ నిర్మాణం చేపట్టడంతోపాటుగా, నగరంలోని వరద నీటిని సైతం అదే రీతిలో డ్రెయిన్ల ద్వారా నగరం దాటించి ఆ తర్వాత మున్నేరులో కలిపేలా ప్రణాళికలు సిద్ధం చేస్తే ముందు నష్టం వాటిల్లే అవకాశం లేదన్న వాదన వినిపిస్తోంది.

సర్వం కోల్పోయాం.. ఆదుకోండి!

(5వ పేజీ తరువాయి)

వస్తువులతోపాటు ధాన్యం, నిత్యావసరాలు, పశువులు, మేకలు కొట్టుకుపోయాయని, సారవంతమైన భూములు కూడా ఇసుకమేటలు వేసి పనికిరాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా కేంద్ర బృందం సభ్యులు మాట్లాడుతూ రాకాసితండా లో జరిగిన వరదనష్టంపై నివేదికలు తయారుచేసి కేంద్రానికి అందిస్తామని, నష్టపోయిన అందరిని కేంద్రం ఆదుకుంటుందన్నారు. అలాగే మరో బృందం సభ్యులు బీరోలు, పాతర్లపాడు, రావిచెట్టుతండాలో పర్యటించారు. గ్రామాల్లో దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు. బీరోలులో చెరువు తెగి బంధంపల్లి-బీరోలు రోడ్డు తెగిపోవడంతో బంధంపల్లికి నీరు చేరడంతో రాకపోకలు నిలిచాయి. ఈ రోడ్డును పరిశీలించారు. పాతర్లపాడులో కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలించారు. హైదర్‌సాయిపేట నుంచి మహబూబాబాద్ జిల్లా ధర్మారంవైపు ఆకేరుపై నిర్మించిన బ్రిడ్జి కూలిపోగా, దానిని కూడా పరిశీలించారు. వంతెనలు, రోడ్లపై అంచనాలు రూపొందించి నివేదికలు అందిస్తున్నట్టు తెలిపారు.

వరద ముంపునకు గురైన ఖమ్మం రూరల్ మండలంలోని గూడూరుపాడు, తనగంపాడు, కస్నాతండా గ్రామాల్లో కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా తనగంపాడు వద్ద ఆకేరు బ్రిడ్జిపై నిలబడి ముంపునకు, కోతకు గురైన పంట పొలాలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో జరిగిన పంటల నష్టం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. కోతకు గురైన పంట భూములను మళ్లీ మామూలు స్థితికి తీసుకురావడానికి ఎంత మట్టి అవసరం అవుతుందని, ఎంత ఖర్చు చేయాల్సి ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. వరద ప్రవాహానికి సర్వం కోల్పోయిన బాధితులతో మాట్లాడి వారికి జరిగిన నష్టం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. తనగంపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించారు. ఆకేరు పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు. నష్టం జరిగిన పంటలను పరిశీలించారు. కాగా, మూడు మండలాల్లో పర్యటించిన కేంద్ర బృందంతో వివిధ శాఖల అధికారులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అధికారుల పనితీరు భేష్

(5వ పేజీ తరువాయి)

స్లూయిస్‌ల సామర్థ్యం పెంచాలని అధికారులను ఆదేశించారు. అలాగే వ్యర్థ జలాల శుద్ధి కేంద్రాన్ని సైతం ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. భద్రాద్రిలో డ్రైనేజీ సమస్య పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా జరిగిన పంటనష్టం అంచనాకు ఇంకెన్ని రోజులు పడతాయని సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను మంత్రి తుమ్మల మందలించారు. ఇప్పటి వరకు ఐదువేల ఎకరాల్లో పంటనష్టం జరిగిందని అధికారులు మంత్రికి తెలిపారు. అంచనా వేయడానికి ఇంకా ఎంత సమయం పడుతుందని అసహనం వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో తిరిగి తుఫాన్ కారణంగా గ్రామాల్లో పంటలకు అనేక చీడలు వ్యాపించే అవకాశం ఉండటంతో వాటి బారిన పడకుండా ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టాలో రైతులకు సూచనలు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. రేషన్ దుకాణాల్లో బియ్యం పక్కదారి పడుతున్న తీరుపై సివిల్ సప్లయీస్ అధికారులతో మంత్రి తుమ్మల ఆరా తీశారు. ఐదు పంచాయతీలు వెనక్కి తిరిగి వస్తేనే భద్రాచలం అభివృద్ధికి వెసులుబాటు లభిస్తుందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఇందుకోసం ఏపీ ప్రభుత్వంతో తాము మాట్లాడుతున్నామన్నారు. భద్రాచలం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమని, తిరుమల తరహాలో భద్రాద్రిని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా అధికార యంత్రాంగానికి సూచించారు.

భద్రాచలం పట్టణంలో నిరంతరం తాగునీటి సరఫరా అందేలా మిషన్ భగీరథ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తుమ్మల ఆదేశించారు. దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. రామాలయ అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్న నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో భూసేకరణ ఎంతో కీలకమన్నారు. ప్రభుత్వం అధికారికంగా పనులు ప్రారంభించే నాటికి భూసేకరణ పనులు పూర్తి చేయాలని భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావును మంత్రి తుమ్మల ఆదేశించారు. అంతకుముందు భద్రాచలం గోదావరి వారధిపై నుంచి, కరకట్టపై నుంచి గోదావరి వరద ఉధృతిని మంత్రి తుమ్మల, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీవో బి.రాహుల్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం నూతన కరకట్ట పనులను సైతం పరిశీలించారు. కాగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భద్రాచలం పర్యటన సమయంలో మంత్రి తుమ్మల, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావులు ఒకే కారులో ప్రయాణించారు. ఈ సమయంలో భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఆ కారును స్వయంగా నడిపి చివరకు భద్రాచలం సబ్‌కలెక్టరు సమావేశ మందిరానికి తీసుకొచ్చారు.

భద్రాద్రి వద్ద గోదావరి తగ్గుముఖం

● కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక

భద్రాచలం, సెప్టెంబరు 11: భద్రాచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహించి అనంతరం తగ్గుముఖం పట్టింది. మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు 50అడుగులున్న గోదావరి నీటిమట్టం బుధవారం ఉదయం 6గంటలకు 50.5 అడుగులకు పెరిగింది. ఏడు గంటలకు 50.6 అడుగులకు వచ్చిన గోదావరి నీటిమట్టం 5గంటల పాటు నిలకడగా ఉండి అనంతరం తగ్గడం ప్రారంభించింది. 12 గంటలకు 50.5 అడుగులు, మూడు గంటలకు 49.7 అడుగులకు, 9 గంటలకు 47.5 అడుగులకు తగ్గింది. దీంతో రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించుకున్నారు. ఇదిలా ఉండగా గోదావరి స్నానఘట్టాలు ఇంకా నీట మునిగి ఉండగా దేవస్థానం కల్యాణ కట్ట కింది భాగం సైతం నీటిలోనే మునిగి ఉంది.



భద్రాచలం వద్ద గోదావరి

7,575 మందికి రూ.12.5 కోట్లు జమ

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 11: మున్నేరు వరద బాధితులకు ప్రభుత్వం అందించే సహాయం బాధితుల బ్యాంకు ఖాతాలకు జమ అవుతోంది. బుధవారం ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 7,575 బాధిత కుటుంబాలకు రూ.16 వేల చొప్పున మొత్తం రూ.12.5 కోట్లు బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. పలు కారణాలతో మరో 1300మంది బాధితుల బ్యాంకు ఖాతాలకు ఎక్స్‌గ్రేషియా అందాల్సి ఉంది. కాగా బ్యాంకు ఖాతాలు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఉన్నా కూడా బ్యాంకు పేరు లేని బాధితుల ఖాతాలను రెవెన్యూ విభాగం అధికారులు పరిశీలన చేసి సమస్యను పరిష్కరించారు. దీంతో మిగిలిన వారికి గురువారం డబ్బులు పడే అవకాశం ఉంది.

మున్నేరు వరద బాధితులను గుర్తించేందుకు ఖమ్మం నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగం, రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఇంటింటి సర్వే చేపట్టారు. అయినా కొంతమంది బాధితులు సర్వే జరగలేదని కమిషనర్ అభిషేక్ అగస్త్యకు నేరుగా వచ్చి ఫిర్యాదులు ఇచ్చారు. దీంతో స్పందించిన కమిషనర్ సర్వే కోరుకొనే వారి కోసం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా బీ బ్లాక్‌లో ఇన్‌వార్డు సెక్షన్‌లో సర్వే కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇద్దరు ఉద్యోగులతో పాటుగా బ్యాంకు సిబ్బందిని కేటాయించారు.

వరద ప్రాంతాల్లో అభివృద్ధి పనులు

» వెంటనే ప్రణాళికలు రూపొందించాలి
» కలెక్టర్‌కు ఎంపీ రఘురాంరెడ్డి సూచన

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 11: ఇటీవల పాలేరు, ఆకేరు, మున్నేరు వరదల ప్రభావానికి గురైన లోతట్టు ప్రాంతాల్లో పునరుద్ధరణ, అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలన్నారు. మౌలిక వసతుల కల్పనకు, ఇతర అభివృద్ధి పనుల నిర్వహణకు అంచనాల ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఇళ్లతోపాటు రైతుల వ్యవసాయ భూములకు కూడా నష్టం వాటిల్లిందని, దీనిపై సర్వే చేసి, గణాంకాలు సిద్ధం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే బాధితులకు పలు రకాలుగా అండగా నిలిచిందని, తన వంతుగా కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కేంద్రీయ విద్యాలయం, ఏకలవ్య పాఠశాలల్లో పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. కొత్త రైల్వే లైన్‌కు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం మున్నేరు వరద బాధితుల సహాయార్థం రామంతపూర్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వైస్ ఛైర్మన్, ఎంపీ రాంసహాయం రఘురామరెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది స్వచ్ఛందంగా విరాళంగా అందజేసిన చెక్కును కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు ఎంపీ అందజేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు కొప్పుల చంద్రశేఖర్ తదితరులున్నారు..

డబ్బుతో ఓట్లు పడతాయనుకోవడం భ్రమ

● బీజేపీ నేత, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

కొత్తగూడెం, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): డబ్బు సంచులతో ఓట్లు పడతాయనుకోవడం భ్రమేనని బీజేపీ నేత, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకుంటేనే నాయకులకు భవిష్యత్తు ఉంటుందన్నారు. ఖమ్మం జిల్లాలో ఎర్రజెండా వెలసిపోయిదన్నారు. ఇక్కడి ప్రజలు కమ్యూనిస్టులను ఏనాడో పక్కన పెట్టారన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో బుధవారం జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రఘునందన్‌రావు ప్రారంభించారు. బీజేపీ సభ్యత్వ నమోదు ఆన్‌లైన్ యాప్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కమ్యూనిస్టులకు సొంతగా గెలిచే శక్తి లేదన్నారు. ఏదో ఒక పార్టీతో పొత్తుపెట్టుకుంటే తప్ప గెలవలేని పరిస్థితి ఆ పార్టీలకు దాపురించిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీకి ఒక్క కొత్తగూడెం సీటు మాత్రమే దక్కిందన్నారు. అదేవిధంగా కొవ్వూరు రైల్వేలైన్‌పై రఘునందన్‌రావు స్పందిస్తూ ఇప్పటికే సర్వే పూర్తయ్యిందని, దీనిపై సమగ్ర సమాచారం తెలుసుకుని ఈ రైల్వేలైన్ నిర్మాణానికి ఖచ్చితంగా కృషి చేస్తానన్నారు. ప్రధాని మోదీ హయంలోనే కొత్తగూడెం ప్రజల కల నెరవేరుతుందని హామీ ఇచ్చారు. ఇందుకోసం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అమెరికాలో పర్యటిస్తున్న కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ దేశం విలువను విదేశీగడ్డపై మంట కలుపుతున్నారని విమర్శించారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బీజేపీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు కేవీ. రంగాకిరణ్, జిల్లా సభ్యత్వ నమోదు కమిటీ, నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, ఎ. రాజేష్, జంపన్న సీతారామరాజు, కొదమసింహం, పాండురంగచార్యులు, ముస్కు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

డెంగ్యూతో సెక్యూరిటీ గార్డు మృతి


సతీష్(ఫైల్)

మణుగూరు, సెప్టెంబరు 11: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఏరియాలోని సింగరేణి సోలార్ పవర్‌స్టేషన్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న తాండ్ర సతీష్ (36) డెంగ్యూతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. గత నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న సతీష్ భద్రాచలం, హుజూరాబాద్‌తో చికిత్స అందించినా ఆరోగ్యం కుదుట పడకపోవడంతో హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతి చెందారు. సతీష్ కుటుంబాన్ని సెక్యూరిటీ ఏజెన్సీ, ప్రభుత్వం ఆదుకోవాలని మణుగూరు ఏరియా ఇఫ్టూ నాయకులు ఎస్‌డీ నాజర్ పాషా, అంగోత్ మంగిలాల్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ గార్డులు చల్లా కాంతారావు, డి. దేవేందర్, వీరాస్వామి, చంద్రం, ప్రేమ్‌కుమార్, కృష్ణ, శ్రీనివాసరావు, ఈశ్వర్, సతీష్, శ్రీకాంత్ ఇలియాజ్ సిదార్థ, ఏ శ్రీను, హరీష్ తదితరులు పాల్గొని సతీష్‌కు సంతాపం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ముదిగొండ, సెప్టెంబరు 11: ముదిగొండ మండలం వనంవారికృష్ణాపురం వద్ద పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు బుధవారం ముదిగొండ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో మురళీ ఆదేశాల మేరకు ఎస్‌ఐ నరేష్ తమ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. గ్రామంలోని పాత రైస్ మిల్లు వద్ద పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,240 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మురళీ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఫర్టిలైజర్స్ దుకాణంలో చోరీ

- రూ. 60వేలు నగదు, ట్యాబ్ అపహరణ

కొణిజర్ల, సెప్టెంబరు11: కొణిజర్లలోని బస్వాపురం గ్రామ క్రాస్‌రోడ్డులో గల జై కిసాన్ ఫర్టిలైజర్స్ షాపులో చోరీ జరిగిన సంఘటన బుధవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్‌ఐ సూరజ్ తెలిపిన వివరాల ప్రకారం.. జైకిషాన్ షాపు యాజమాని కృష్ణ రోజుమాదిరిగా మంగవారం రాత్రి దుకాణాన్ని మూసి వెళ్లాడు. బుధవారం ఉదయం వచ్చి చూసే సరికి షాపు వెనుకభాగం షటర్ తాళం పగటగొట్టి ఉండటంతో పోలీస్‌లకు సమాచారం ఇచ్చాడు. దుకాణాన్ని పరిశీలించగా రూ. 60వేలు నగదు, రూ.పదివేలు విలువ చేసే ట్యాబ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నారంవారిగూడెం కాలనీలో దొంగల భీభత్సం

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 11: మండలంలోని నారంవారిగూడెం కాలనీలో మంగళవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నారంవారిగూడె కాలనీలో రోడ్డు పక్కన నివాసం ఉండే తుమ్మలపల్లి సూరిబాబు అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో బయటకు రాగా అప్పటికే అక్కడ మాటువేసి ఉన్న ఇద్దరు వ్యక్తులు అతడిపై దాడిచేసి ఇంట్లోకి చొరబడ్డారు. సూరిబాబు భార్య కళావతి మెడలోని గొలుసును లాక్కొనే ప్రయత్నం చేయగా, ఆమె అడ్డగించటంతో గొలుసు సగానికి తెగిపోయింది. దానిని తీసుకొని దొంగలు పారిపోయారు. గాయపడిన సూరిబాబును ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వేధింపుల కేసులో భర్తకు జైలు

కొత్తగూడెం లీగల్, సెప్టెంబరు11 : అదనపు కట్నం వేధింపుల కేసులో భర్తకు ఆరు నెలల జైలు శిక్షతోపాటు రూ.1000ల జరిమానా విధిస్తూ కొత్తగూడెం మూడో అదనపు జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి. శివనాయక్ బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాల ప్రకారం.. కొత్తగూడెంలోని లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పెద్దతండాకు చెందిన విజయను తన తల్లిదండ్రులు అదే గ్రామానికి చెందిన భూక్య బాలుకు ఇచ్చి రూ. రెండున్నర లక్షల కట్నం, ఇంటి సామాన్లు, ద్విచక్రవాహనం ఇచ్చి వివాహం జరిపించారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2012 అక్టోబర్ 31న తన భర్త భూక్య బాలు తల్లిదండ్రులు తన బంధువులు లక్ష రూపాయల అదనపు కట్నం తీసుకురావాలని వేధించారు. తన భర్త ఓ మహిళతో వివాహేతర సంబంధం ఏర్పర్చుకుని రెండో వివాహం చేసుకుంటానని బెదిరించేవాడని, ఇంటి నుంచి వెళ్లగొట్టాడని, అప్పటి కొత్తగూడెం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ రామ లక్ష్మణ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కోర్టులో 8మంది సాక్షులు విచారణ అనంతరం భూక్య బాలుపై నేరం రుజువు కావడంతో, అతడికి కోర్టు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ ఎస్. లావణ్య నిర్వహించారు. లైజన్ ఆఫీసర్లు ఎస్‌కే. ఘని, కానిస్టేబుల్ రామకృష్ణలు సహకరించారు.

గోవుల తరలింపును అడ్డుకున్న బీజేపీ నాయకులు


ట్రాలీలో ఉన్న పశువులు

పాల్వంచ, సెప్టెంబరు11: గోవుల అక్రమ తరలింపును బీజేపీ నాయకులు బుధవారం అడ్డుకున్నారు. పాల్వంచ పట్టణ పరిధిలోని నవభారత్ ప్రాంతంలోగల అన్నపూర్ణ గోశాల నుంచి అక్రమంగా గోవులను తరలిస్తున్నారని బీజేపీ నాయకులు ట్రాలీని అడ్డుకున్నారు. ట్రాలీని, ట్రాలీ డ్రైవర్‌ను పాల్వంచ టౌన్ పోలీసులకు అప్పగించారు. అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టౌన్ ఎస్‌ఐ సుమన్‌కు వారు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భూక్యా రవి నాయక్, గంధం నాగేంద్ర ప్రసాద్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష చొప్పున పరిహారం చెల్లించాలి..

● సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర నేతల డిమాండ్


బాధితుల నివాసంలో నష్టాన్ని రాసుకుంటున్న రాష్ట్ర నాయకులు

ఖమ్మం సంక్షేమవిభాగం, సెప్టెంబరు 11: ప్రభుత్వాలు మారినా మున్నేరు పరివాహక ప్రాంతంలోని వరద ముంపు ప్రాంత ప్రజల జీవితాలు మాత్రం మారటం లేదని, ప్రతి సంవత్సరం వరద ముంపుతో తమ ఆస్తులు వరద పాలవుతున్నాయని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కెచ్చల రంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం బాధిత కుటుంబాలను రాష్ట్ర బృందం పరిశీలించారు. జరిగిన నష్టాన్ని ఇంటింటికి తిరిగి నమోదు చేసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.10వేలు ఇంట్లో దుస్తులకు కూడా సరిపోవని, ప్రతీ కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.లక్ష అందించాలని, మైదాన ప్రాంతంలో రూ.5లక్షలతో ఇళ్ల నిర్మాణం చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబంలోనూ రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. వరద ముంపుపై ముందస్తుగా ప్రజల్ని అప్రమత్తం చేయకపోవటంతో నష్టం వాటిల్లిందన్నారు. జిల్లా కమిటీ కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, వీ ప్రభాకర్, చిన్న చంద్రన్న, రామకృష్ణ, ఆవుల వెంకటేశ్వర్లు, పుల్లయ్య, ఆవుల అశోక్, ఝాన్సీ, శోభ, మంగతాయి, సురేశ్, శ్రీను, భరత్, సత్తార్, ధరణి పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి

వైరా, సెప్టెంబరు 11: ఖమ్మంజిల్లాలోని మిషన్ భగీరథ పథకాలకు చెందిన విద్యుత్ సబ్‌స్టేషన్లలో పనిచేస్తున్న ఆపరేటర్లకు ఆరునెలలుగా వేతనాలు లేక అల్లాడిపోతున్నారు. వైరా, పాలేరు, కనకగిరి మిషన్ భగీరథ పథకాల వద్ద ఉన్న సబ్‌స్టేషన్లలో పనిచేస్తున్న ఆపరేటర్లకు ఆరునెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించి ఆదుకోవాలని బుధవారం మిషన్ భగీరథ ఎస్‌ఈకి ఆపరేటర్లు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 23జిల్లాల్లో ఆరునెలల కిందటి వరకు ట్రాన్స్‌కో పరిధిలో నడిచిన సబ్‌స్టేషన్లలో ఆపరేటర్లకు సక్రమంగానే వేతనాలు చెల్లించారని పేర్కొన్నారు. అయితే ట్రాన్స్‌కో నుంచి సబ్‌స్టేషన్లను తప్పించి ఆపరేటర్లకు వేతనాలు ఇచ్చేందుకు ఒక కాంట్రాక్టు ఏజెన్సీకి అప్పగించిన నాటి నుంచి వేతనాలు ఇవ్వడం లేదని ఆపరేటర్లు వాపోతున్నారు. 23జిల్లాల్లో 120మంది వారిలో ఒక్క ఖమ్మం జిల్లాలోనే 9మంది ఆపరేటర్లు వేతనాలు లేక ఆందోళన చెందుతున్నామని వాపోయారు. ఈ పెండింగ్ వేతనాలు ఇప్పించాలని కోరారు. సీఐటీయూ నాయకులు తిరుమలాచారి, పాపగంటి రాంబాబు, శ్రీకాంత్, ఉపేందర్‌రెడ్డి, మారేష్, తిరుపతిరావు పాల్గొన్నారు.

కనీవినీ ఎరుగని నష్టం

- ప్రభుత్వం సాయం చేస్తేనే బతుకు ముందుకు
- జిల్లాలో వరద నష్టం రూ.729.68 కోట్లు
- ఖమ్మంలో మున్నేరు దెబ్బకు రూ.100 కోట్లు ఫట్
- కేంద్ర బృందంపైనే బాధితుల ఆశలు

ఖమ్మం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మున్నేరు పరివాహకంలో కురిసిన అకాల భారీవర్షాలతో పాటు జిల్లాలో ఇతర చోట్ల వర్షంతో వచ్చిపడిన వరదలు, ఖమ్మం జిల్లాను అతలాకుతలం చేశాయి. జిల్లా కేంద్రం ఖమ్మంతోపాటు పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం, మధిర నియోజకవర్గంలోని ముదిగొండ, చింతకాని, ఎర్రుపాలెం, బోనకల్ మండలాలు మున్నేరు పాలేరుతో తీవ్ర నష్టం చూడగా, వైరా ఏరు పొంగడంతో కొణిజర్ల, వైరా, తల్లాడ, కారేపల్లి, కామేపల్లి మండలాల్లో కూడా అకాలవర్షాలు అధిక నష్టం చూపించాయి. జిల్లాలో జరిగిన వరద నష్టం రూ.729.68 కోట్ల వరకు నష్టం జరిగిన విషయం విధితమే. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వరద బాధిత కుటుంబాలకు రూ.16,500 చొప్పున సుమారు రూ.25కోట్లు తక్షణసాయంగా కేటాయించింది. రైతులకు కూడా ఎకరానికి రూ.10వేల పరిహారం ప్రకటించింది.

అయితే రాష్ట్ర ప్రభుత్వ సహకారానికి కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా పెద్దఎత్తున నిధులు కేటాయిస్తేనే వరద బాధిత కుటుబాలకు, రైతులకు ఓదార్పు ఉండే అవకాశం ఉంది. జిల్లాలో పర్యటిస్తున్న కేంద్రబృందం కేంద్రానికిచ్చే నివేదికలు ఆతర్వాత కేంద్రం ఇచ్చే సహకారం పైనే వరద బాధితులు, అధికారుల రాష్ట్ర ప్రభుత్వం కొండతం ఆశ పెట్టుకుంది.

రెండురోజుల పాటు వరద బృందం పర్యటనలో జిల్లాకు జరిగే నష్టంపై అధికారులు నివేదికలు కూడా అందించారు. కేంద్ర పరిశీలన బృందం జిల్లాలో జరిగిన నష్టాన్ని కేంద్రానికి కూడా నివేదిక ఇవ్వబోతుంది. జిల్లాలో గతంలో ఎన్నడులేని విధంగా ఖమ్మం పాలేరు, మధిర, వైరా నియోజకవర్గాల్లో మున్నేరువరదలతో పాటు తుపాన్‌తో తీవ్ర నష్టం , కష్టం కలిగించాయి. జిల్లాలో జరిగిన నష్టం ఇప్పటికే ప్రభుత్వం సర్వేల ద్వారా ప్రాథమిక అంచనా వేసింది. అధికారుల లెక్క ప్రకారమే సుమారు రూ.729.68 కోట్లు నష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనాలు వేశారు. అయితే అనధికారిక లెక్కల ప్రకారం ఈనష్టం విలువ మరింతగా ఉండనుంది. వరద బాధితులకు ప్రభుత్వం ఇళ్లు పట్టి సర్వం కోల్పోయిన కుటుంబానికి రూ.16,500 ప్రకటించి అందిస్తున్నారు. అలాగే ఇల్లు పడిపోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లకిద రూ.5లక్షలతో ఇళ్లు నిర్మించబోతున్నారు. అయితే జరిగిన నష్టం ఇచ్చే పరిహారానికి పొంతన లేదని, వరద బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో సుమారు 15,258 కుటుంబాలు, ఇళ్లు వరద ముంపునకు గురికాగా, 150 ఇళ్లు, షెడ్లు వరదల్లో కూలిపోయాయి. ఖమ్మంజిల్లా చరిత్రలో గతంలో ఎన్నడులేని విధంగా ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాల్లో వరద ఉప్పొంగడంతో వరద బాధితులు సర్వం కోల్పోయారు. కడునిరుపేద ఇంటిలో కనీసం రూ.25వేలనుంచి 50వేల నష్టం జరిగితే మధ్యతరగతి కుటంబాల్లో రూ.50వేలనుంచి లక్షవరకు నష్టం జరిగింది. ఉన్నత వర్గాల్లో రూ.లక్షనుంచి 3లక్షల వరకు విలువైన వస్తువులకు నిత్యావసరాలకు, నష్టం వాటిల్లింది. కనీసం కుటుంబానికి సగటున రూ.50వేల నుంచి లక్షరూపాయల వరకు నష్టం జరిగింది. ఈనష్టం విలువ రూ.100కోట్లపైనే ఉంది. ప్రభుత్వం రూ.25కోట్లు తక్షణసాయం కింద ఇచ్చి రూ.16,500 అందిస్తున్నారు. గత ప్రభుత్వ సాయం కంటే ఇది అధికమే. అయితే దీనికి కేంద్ర ప్రభుత్వం కూడా అదనపు సాయం అందిస్తే వరద బాధితలకు కొంతవరకైనా ఓదార్పు ఉండే అవకాశం ఉంది. ఈసాయం పెంచాలని బాధితులు వేడుకుంటున్నారు.

ఇసుకమేటలు, రాళ్లకుప్పలతో తీవ్ర నష్టం

జిల్లాలో మున్నేరు, పాలేరు, ఆకేరు నదులు పొంగి ప్రవహించిన వరదలతోపాటు భారీవర్షాల నీటితో అనేక వాగులు చెరువులకు వరద నీరు వచ్చిపడడంతో వ్యవసాయ పంటలకు కూడా భారీనష్టం జరిగింది. జిల్లాలో పత్తి, వరి, మిర్చి, పెసర, మొక్కజొన్న, కూరగాయలతో పాటు పలురకాల పంటలకు సంబంధించి 46,374మంది రైతులకు చెందిన 68,345 ఎకరాల్లో పంటలు కోల్పోయారు. తద్వారా రూ.133 కోట్ల వరకు నష్టం జరిగిందని అంచనా.. ఇందులో ప్రధానంగా వరి 35,590 ఎకరాలు, పత్తి 27,639 ఎకరాలు, పెసర 660 ఎకరాలు, మొక్కజొన్న 47 ఎకరాలు, మిర్చి 4,178ఎకరాలు, కూరగాయలు 131 ఎకరాలు, అరటి 32 ఎకరాలు, బొప్పాయి 68 ఎకరాలలో నష్టం జరిగింది. కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మంరూరల్, చింతకాని, ముదిగొండ తదితర మండలాల్లో పంటపొలాల్లో ఇసుకమేటలు కూడా వేశాయి. ప్రభుత్వం ఎకరానికి రూ.10వేలు సహాయంప్రకటించింది. రైతులు ఎకరానికి ఇప్పటికే రూ.25వేల వరకు పెట్టుబడులు పెట్టారు.


పొలంలో రాళ్లు చేరిన దృశ్యం(ఫైల్)

మిర్చితోటలకు రూ.50వేలు పెట్టుబడులు పెట్టారు. పంటలపైపొట్లు తరుణంలో వచ్చి పడిన వరద వానాకలం పంటలను తీవ్రంగా నష్టం చేకూర్చింది. ప్రభుత్వం రూ.10వేలుఇచ్చే సాయం సరిపోదని రైతాంగం పేర్కొంటుంది. రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేలు అందిస్తున్నందున కేంద్రం నుంచి కూడా అదనంగా నిధులు ఇస్తే రైతులకు మరింత భరోసాగా ఉండే అవకాశం ఉంది. జిల్లాలో జరిగిన పంటల నష్టం రూ.200కోట్లపైనే ఉంటుందని అనధికారిక అంచనా. ఇసుక మేటలు వేసిన పొలాల్లో ఈఏడాది వ్యవసాయం చేసుకునే పరిస్థితి లేదు. అలాగే జిల్లాలో పశుసంపద, మత్యసంపద కూడా భారీనష్టం జరిగింది. నీటిపారుదల, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖలకు అధిక నష్టం జరిగింది. ప్రధానంగా ఇరిగేషన్‌లో ఎన్ఎస్‌పీ కాలవలకు గండ్లు పడడంతోపాటు చెరువులకు గండ్లు పడ్డాయి. నీటిపారుదలకుశాఖకే రూ.434 కోట్ల వరకు నష్టం జరగగా, ఆర్అండ్‌బీకి రూ.151.69కోట్లు నష్టం జరిగింది. రోడ్లు గండుల నడగా బ్రిడ్జిలు కల్వర్టులు కొన్నిచోట్ల కొట్టుకుపోయాయి. పంచాయతీరాజ్‌శాఖకు రూ.34.77కోట్లు నష్టం వాటిల్లింది. పంచాయతీరాజ్ సిమెంట్ రోడ్లు సైతం దెబ్బతిన్నాయి. కల్వర్టులు కొట్టుకు పోయాయి.

జిల్లాలో పవువులు, కోళ్లకు తీవ్ర నష్టం వాటిల్లింది. మొత్తం 77,821 కోళ్ళ, పశువుల, గొర్రెలు మేకలు చనిపోగా రూ.1.48కోట్లు నష్టం జరిగింది. దీనికి తోడు ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు భవనాలు దెబ్బతిన్నాయి విద్యుత్ శాఖకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. విద్యుత్‌శాఖకు రూ.7.73కోట్లు నష్టం జరగ్గా, ప్రభ/త్వ పాఠశాలలకు రూ.1.20కోట్లు, ఆసుపత్రులకు రూ.30లక్షలు నష్టం జరిగింది. మత్యసందపకు చెరువులు దెబ్బతినడంతో రూ.4.44కోట్లు నష్టం జరిగింది. జిల్లాలో ఈతీరున ఇళ్ల, ఆస్థినష్టం , పంటల నష్టం పెద్దఎత్తున సంభవించింది. ఇప్పుడు కేంద్రం కూడా కనికరిస్తేనే రాష్ట్ర ప్రభుత్వ సహాయానికి కేంద్ర ప్రభుత్వ సహాయం చేదోడుకానుంది. దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు పనులకు నిధులు వస్తేనే త్వరితగతిన పనులు ప్రారంభించే అవకాశం ఉంది.

మాజీ ఎంపీ నామాకు దక్షిణ మధ్య రైల్వే అభినందనలు

- జడ్ఆర్ యూసీసీ సభ్యుడిగా విశేషమైన కృషి చేశారంటూ లేఖ

ఖమ్మంటౌన్, సెప్టెంబరు 11: లోక్‌సభ సమయంలో జడ్ఆర్ యూసీసీ సభ్యుడిగా అప్పటి ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు రైల్వే సమస్యల పరిష్కారం కోసం విశేష కృషి చేశారని దక్షిణ మధ్య రైల్వే అభినందనలు తెలిపింది. సికింద్రరాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ కార్యాలయం నుంచి సంబంధిత శాఖ డిప్యూటీ జనరల్ మేనేజర్ జడ్ఆర్ యూసీసీ ఎక్స్-అఫిషియో కార్యదర్శి రాసిన లేఖను బుధవారం ఖమ్మం మాజీ ఎంపీ నామా కార్యాలయానికి పంపారు. దక్షిణ మధ్య రైల్వే జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (జడ్ఆర్ యూసీసీ) సభ్యుడిగా ఎంతో సహకారం ఇచ్చారని నామా ఇచ్చిన సలహాలు, సూచనలతో దక్షిణ మధ్య రైల్వే తన సేవలను మెరుగు పరుచుకుందని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర విభజన హామీలో భాగంగా ఖాజీపేటలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని జెడ్ఆర్ యూసీసీ సమావేశాల్లో సభ్యుడిగా నామా పలుమార్లు ప్రస్తావించారు. అలాగే ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని రైల్వే స్టేషన్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించడంలో నామా ఎంతో కృషి చేశారు. జిల్లాలో అమృత్ భారత్ పథకం కింద ఖమ్మం, మధిర, కొత్తగూడెం రైల్వేస్టేషన్ల అభివృద్ధికి జడ్ఆర్ యూసీసీ సభ్యుడిగా రూ.76.50కోట్లు మంజూరు చేయించానని నామా నాగేశ్వరరావు తెలిపారు.

భద్రాద్రిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలి

- తిరుమల వలె నిర్వహణ ఉండాలి
- భద్రాచలం 'పంచాయతీ'పై ప్రజామోదం మేరకే నిర్ణయం
- జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మంత్రి తుమ్మల

భద్రాచలం, సెప్టెంబరు 11: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలి భద్రాచలం అభివృద్ధికి ఏం చేస్తే బాగుంటుంది అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఆలోచించి ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్‌లను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. భద్రాచలంలో వరద పరిస్థితిని పరిశీలించేందుకు వచ్చిన ఆయన వారితో పాటు ఇతర శాఖల అధికారులతో మాట్లాడుతూ పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న భద్రాద్రి నిర్వహణ తిరుమల లెక్క ఉండాలని ఆకాంక్షించారు. ఇదే సమయంలో భద్రాచలంను మూడు పంచాయతీలుగా ఉంచాలా? ఒక పంచాయతీగా ఉంచాలా, టెంపుల్ టౌన్‌గా ఉంచాలా అనే అంశంపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించండి, గతంలో నేను మంత్రిగా ఉన్న సమయంలో టెంపుల్ టౌన్ చేశా. దీంతో ఆనాడు పంచాయతీకి ఎన్నికలు నిర్వహించలేదు. అయితే ఈసారి భద్రాద్రి వాసుల ప్రజామోదం మేరకే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. కాబట్టి ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని అధికారులకు సూచించారు.

నీటి సరఫరా గంటసేపేనా?

జీవనది గోదావరి పక్కనున్న భద్రాద్రిలో గంట నీటి సరఫరానా అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశ్చ


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ర్యపోయారు. మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడుతున్న క్రమంలో భద్రాద్రిలో ఎంత సేపు తాగునీటి సరఫరా చేస్తున్నారని ప్రశ్నించగా గంటసేపు అని సంబంధిత అధికారి సమాధానం ఇచ్చారు. ఈ క్రమంలో జీవనది గోదావరి పక్కనున్న క్రమంలో నిరంతరం మంచి నీటి సరఫరా చేయకపోతే ఎలా అని మంత్రి ప్రశ్నించారు. ఈ సంప్రదాయాన్ని మార్చాలని రెండు దశాబ్దాల నాటి జనాభాకు నేటికి ఎంతో అవసరాలు పెరిగాయని, ఈ క్రమంలో భవిష్యత్‌లో ఐదు దశాబ్దాల వరకు సరిపడా తాగునీటి సరఫరా అందేలా అంచనాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

ఐఏఎస్‌లు అడుగుతుంటారు..

నేటికి గతంలో ఉమ్మడి జిల్లాలో పని చేసిన ఐఎఎస్ అధికారులు నీరబ్‌కుమార్ ప్రసాద్, గిరిధర్, అరవింద్‌కుమార్ లాంటి సీనియర్ అధికారులు మన భద్రాద్రి ఎలా ఉంది సార్ అంటూ నాకు ఫోను చేసి అడుగుతూ ఉంటారని మంత్రి తుమ్మల అధికారులతో పేర్కొన్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలో పని చేసిన ఎంతో మంది ఐఎఎస్ అధికారులు కేంద్రంలో, రాష్ట్రంలో కీలక స్థానాల్లో ఉన్నారని వారు నేటికి భద్రాద్రి అభివృద్ధిని ఆకాంక్షిస్తూ అడుగుతుండటం నన్ను ఎంతగానో ఆలోచింపజేస్తుందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం పని చేస్తున్న అధికారులు భద్రాద్రి నాది ....నా సొంతం దీనిని ఏ విధంగా అభివృద్ధి చేయాలి అనే తపనతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆయన సూచించారు.

భద్రాచలంలోని వ్యర్థ జలాలను(మురుగునీరు) నేరుగా గోదావరిలోకి వదిలితే ఎలా....దిగువన ఉండే ప్రజలకు ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది కదా. ఈ క్రమంలో ఇక నుంచి వ్యర్థ జలాలను నేరుగా గోదావరిలోకి విడుదల చేయవద్దని మంత్రి తుమ్మల అధికారులకు సూచించారు. ఈ సమయంలో సంబంధిత అధికారులు వ్యర్థ జలాల శుద్ధి కేంద్రం శిథిలమైందని మంత్రి దృష్టికి తేగా అవసరమైతే మళ్లీ కొత్తగా వ్యర్థజలాల శుద్ధి కేంద్రాన్ని నిర్మించండి ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయండి అంటూ అధికారులను ఆదేశించారు.

వందశాతం ఫలితాలు సాధించాలి: డీఈవో

దమ్మపేట, సెప్టెంబరు11 : పదో తరగతిలో వంద శాతం ఫలితాలు వచ్చేలా చూడాలని డీఈవో వెంకటాచారి అన్నారు. బుధవారం దమ్మపేట మండలంలోని గండుగులపల్లి, నాగుపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాదివలే ఈఏడాది 10వతరగతిలో వందశాతం ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థుల సామర్ధ్యాలను పరిశీలించారు. పాఠశాలలో పలు అంశాలపై ఉపాధ్యాయులతో డీఈవో సమీక్షించారు. నాగుపల్లి పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. డీఈవో వెంట ఎంఈవో లక్ష్మి, సీఎంవో సైదులు, ఎంఎన్‌వో జగపతి ఉన్నారు.

కరకగూడెంలో ఆక్రమణల తొలగింపు

కరకగూడెం, సెప్టెంబరు 11: మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో వ్యాపారస్థులు, గ్రామస్థులు డ్రైయినేజీలను, ఫుట్‌పాత్‌లను అక్రమించడంతో తహసీల్దార్ నాగప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీవో కుమార్ ఆధ్వర్యంలో బుధవారం వాటిని తొలగించారు. వ్యాపారస్తులు కానీ గ్రామస్థులు కానీ ఫుట్ పాత్‌లను, డ్రైయినేజీలను అక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రైయినేజీలలో వ్యర్థాలను వేయవద్దని అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి, ఆర్ఐలు కృష్ణ ప్రసాద్, హుస్సేన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ తీర్పును పునః పరిశీలించాలి'

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు11: ఎస్సీ వర్గీకరణ తీర్పును పునః పరిశీలించాలని కోరుతూ మాల మహానాడు ఆధ్వర్యంలో భద్రాద్రి కలెక్టరేట్ వద్ద నిరసన ధర్నా జిల్లా జెఏసీ కమిటీ కన్వీనర్ మధుసూధన్‌రావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాద్రి కలెక్టరేట్ వద్ద నిరసన ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు. అనంతరం ఈ విషయమై కలెక్టర్ కార్యాలయంలో అధికారికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. తొలుత కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీగా బయలు దేరి కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి (జేఏసి) మహిళా కన్వీనర్ మేరుగు అనసూర్య, సభ్యులు దాసరి నాగేశ్వరరావు, వాసుమల్ల సుందర్‌రావు, తోటమళ్ళ రమణమూర్తి, గిడ్ల పరంజ్యోతిరావు, ఏడెల్లి గణపతి, దారా చిరంజీవి, కూరపాటి రవీందర్, తుంపురు శివ, దాసరి శేఖర్, నక్కా సృజన తదితరులు పాల్గొన్నారు.


భద్రాద్రి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న మాల మహానాడు జేఏసీ నాయకులు

శరవేగంగా పంట నష్టం సర్వే

ఎర్రుపాలెంలో 2వేల ఎకరాల్లో

ఎర్రుపాలెం, సెప్టెంబరు11: ఎర్రుపాలెం మండలంలో జిల్లాలో గరిష్ఠంగా 29సెం.మీ.నమోదు కావడంతో భారీగా వరదనీరు ముంచెత్తి పంట పొలాలు జలమయం అయ్యాయి. దీంతో ఏఈవోలు నష్టపరిహారం లెక్కగట్టేందుకు గ్రామాల్లో శరవేగంగా నష్టాన్ని లెక్కిస్తున్నారు.

పంటలన్నింటికి నష్ట పరిహారం చెల్లించాలని ఎర్రుపాలెం సొసైటీ చైర్మన్ మూల్పూరి శ్రీనివాసరావు కోరారు. ఎర్రుపాలెం మండలంలో 2వేల ఎకరాల్లో పంటనష్టం జరిగిందని, 12వతేదీనాటికి సర్వేడేటాను ఆన్‌లైన్ చేసి తుది నివేదికలను ప్రభుత్వానికి అందిస్తామని మధిర డివిజన్ సహాయ సంచాలకులు స్వర్ణ విజయచంద్ర తెలిపారు.

కారేపల్లి మండలంలో 430ఎకరాల్లో..

కారేపల్లి సెప్టెంబరు11: కారేపల్లి మండల వ్యాప్తంగా మొత్తం 430 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయశాఖ అధికారి బట్టు అశోక్‌కుమార్ బుధవారం తెలిపారు. పత్తి 176 ఎకరాల్లో, వరి 174ఎకరాలు, మిర్చి90ఎకరాల్లో నష్టం వాటిల్లిందన్నారు. జరిగిన పంటలనష్టలపై ఏఈవోలతో పంచాయితీల వారిగా సర్వేచేసి జిల్లా అధికారులు నివేదికలు పంపించనున్నట్లు తెలిపారు.

కనీస మద్దతు ధర పొందాలి

- జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి ఎంఏ.అలీం

వైరా, సెప్టెంబరు 11: రైతులు నాణ్యతాప్రమాణాల ఆధారంగా ఎండబెట్టి పూర్తిగా శుభ్రపరిచి పెసలు విక్రయించుకొని కనీస మద్దతు ధర పొందాలని జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి ఎంఏ.అలీం అన్నారు. వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో డీసీఎంఎస్ పెసలు కొనుగోళ్లు చేపట్టింది. ఈ పెసలు కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించి పరిశీలించి మాట్లాడారు. గన్నీసంచుల కొరత ఉందని రైతులు ఫిర్యాదు చేయడంతో స్పందించిన అలీం వెంటనే మార్క్‌ఫెడ్ డీఎంతో మాట్లాడి గన్నీసంచులను వైరాకు పంపించాలని కోరారు. వైరా మార్కెట్ కమిటీ కార్యదర్శి మోసిన్ సుల్తా నా, సిబ్బంది వి.వెంకటేశ్వర్లు, బి.విజయకుమారి, స్వామ్రాజ్యం, డీసీఎంఎస్ ఉద్యోగి నాగరాజు పాల్గొన్నారు.

మధిర నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ.105 కోట్లు మంజూరు

మధిర, సెప్టెంబరు 11: మధిర నియోజకవర్గంలోని మధిర, బోనకల్, చింతకాని, ముదిగొండ మండలాల్లో పంచాయతీరాజ్ శాఖనుంచి ఆర్అండ్‌బీ శాఖకు బదిలీ చేయబడ్డ పలురోడ్ల అభివృద్ధికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సిఫార్సుతో రాష్ట్రప్రభుత్వం రూ.105కోట్ల నిధులను మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు ఈనెల 10న ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పట్ల ఆయా మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

13న అతిథి అధ్యాపకులకు ఇంటర్వ్యూలు

ఖమ్మం ఖానాపురంహవేలి సెప్టెంబరు11: నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియమానికి గాను ఈ నెల 13న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని పేర్కొన్నారు. పీహెచ్‌డీ, ఎంఫిల్, నెట్ స్లేట్ వంటి అదనపు అర్హతలతోపాటు బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు సకాలంలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

అమరుల త్యాగఫలమే తెలంగాణ విలీనం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి భాగం హేమంతరావు


గిరిప్రసాద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మంటౌన్, సెప్టెంబరు 11: భారత కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో జరిగిన పోరాటం, అమరుల త్యాగఫలితంగానే భారతదేశంలో తెలంగాణ విలీనమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు భాగం హేమంతరావు పేర్కొన్నారు. తెలంగాణా సాయుధ పోరాట వారోత్సవాలను బుధవారం జిల్లా సీపీఐ కార్యాలయంలో అమరుల చిత్రపటాలకు నివాళులర్పించి మాట్లాడారు. సాయుధ తెలంగాణ పోరాటయోధుడు నల్లమల గిరిప్రసాద్‌కు సీపీఐ ఘనంగా నివాళులర్పించింది. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కే. జానీమియా, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గులు శింగు నర్సింహారావు, బీజే.క్లెమెంట్, పోటు కళావతి, సీహెచ్. సీతామహాలక్ష్మి, తాటి వేంకటేశ్వరరావు, పగడాల మల్లేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలి: సాబీర్‌పాషా

సుజాతనగర్: నైజాం నిరంకుశపాలన అంతం కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిగా కేంద్ర, రాష్ట్ర నయా దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు పోరాటానికి సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట యోధులు రావి నారాయణరెడ్డి స్తూపం వద్ద బుధవారం అమరవీరులకు నివాళులు అర్పించిన అనంతరం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ అమరుడు కోమారి రామయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, దస్రు, కంచర్ల జమలయ్య పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
8
గురువారం 12 సెప్టెంబరు 2024

ఓటు హక్కు నమోదుకు అవగాహన కల్పించాలి

● అదనపు కలెక్టర్ వేణుగోపాల్

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 11: 18 ఏళ్లు నిండి అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు కోసం నమోదు చేసుకునేలా పార్టీల నాయకులు కూడా అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ సూచించారు. తహసీల్దారు కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఓటు నమోదు, చనిపోయిన వారి ఓటు తొలగించటంతో పాటు పలు అంశాలపై చర్చించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అర్హత కలిగిన యువత ఓటు కోసం తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఇటీవల చేపట్టిన ఇంటింటి సర్వేను పరిశీలించారు. సమావేశంలో తహసీల్దారు కృష్ణప్రసాద్, పార్టీల నాయకులు పుల్లయ్య, రాంబాబు, రామకృష్ణ, సంపూర్ణ, మడకం ప్రసాద్, బండారు చంద్రశేఖర్‌తో పాటు పలువురు ఉన్నారు.

విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత అవసరం

● ఆర్బీఐ 90 పేరుతో క్విజ్ కార్యక్రమం: లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి

పాల్వంచ, సెప్టెంబరు 11: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 90 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అండర్ గ్రాడ్యుయేట్స్‌కు నిర్వహిస్తున్న క్విజ్ కాంపిటీషన్స్‌పై డిగ్రీ కళాశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హాజరైన డిస్ట్రిక్ట్ లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి క్విజ్ పోటీల నిర్వహణపై విద్యార్థులకు వివరించి వారిచేత రిజిస్ట్రేషన్ చేయించారు. ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా డిగ్రీ స్థాయి విద్యార్థులకు ఆర్బీఐ-90 పేరుతో క్విజ్ పోటీలు నిర్వహిస్తుందని, విద్యార్థుల్లో ఆర్థిక అక్షరాస్యత పెంపొందించడంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ పోటీలు నాలుగు దశల్లో ఉంటాయన్నారు. మొదటిగా ఆన్‌లైన్ ద్వారా ప్రారంభమై స్టేట్, జోనల్, ఫైనల్ దశల్లో పోటీలు జరుగుతాయని అన్నారు. ఆసక్తి, ఉత్సాహం ఉన్న విద్యార్థులు వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని, 2024 సెప్టెంబరు 1 నాటికి 25 ఏళ్ల వయస్సు లోపు ఉండి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో డిగ్రీ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని అన్నారు. అంగ్లం, హిందీ భాషల్లో పోటీ ఉంటుందని, దేశ, అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాలు, ఆర్బీఐ డిజిటల్ కరెన్సీ, ఆర్థిక వ్యవస్థ, చరిత్ర క్రీడలు, సాహిత్యం, శాస్త్ర, సాంకేతిక అంశాలకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయన్నారు. రిజిస్ట్రేషన్ చివరి తేదీ ఈ నెల 17 అని, విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జెన్కో సీఎండీని కలిసిన టీ జాక్ నాయకులు


జెన్కో సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న టీ జాక్ నాయకులు

పాల్వంచ, సెప్టెంబరు 11: జెన్కో, ట్రాన్స్‌కో సీఎండీ రోనాల్డ్ రోస్‌ను టీ జాక్ నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని విద్యుత్‌సౌదాలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో ఇటీవల వరదలతో తీవ్రంగా నష్టపోయిన వరద బాధితుల సహాయార్థం ఉద్యోగ, కార్మికులందరి ఒక రోజు మూలవేతనం రికవరీ చేసి వరద బాధితుల సహాయార్థం అందజేయాలని సీఎండీని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. అదే విధంగా ఈపీఎఫ్ టూ జీపీఎఫ్ పై త్వరలో నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఆర్టిజన్స్‌కు గ్రేడ్ చేంజ్, కన్వర్షన్ ఇవ్వాలని కోరారు. వీటిపై స్పందించిన సీఎండీ ముందుగా వరద బాధితుల సహాయార్థం ఒక రోజు వేతనం ఇవ్వడానికి ముందుకు వచ్చినందుకు టీ జాక్ సభ్యులను అభినందించారు. అదే విధంగా టీజాక్ నాయకులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను అతి త్వరలో పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాక్ నాయకులు కోడూరి ప్రకాష్, అంజయ్య, జాన్సన్, చారుగుండ్ల రమేష్, నాజర్, మాతంగి శ్రీను, వెంకట్, అనురాధ, నరేంద్ర పాల్, రాములు, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం వరద బాధితులకు నవ లిమిటెడ్ సాయం

●1000 కుటుంబాలకు వంట సామగ్రి, దుప్పట్లు పంపిణీ

పాల్వంచ టౌన్, సెప్టెంబరు 11: ఇటీవల ఖమ్మం మున్నేరుకు వచ్చిన భారీ వరదలతో ఖమ్మంలో సర్వం కోల్పోయిన వరద బాధితులకు పాల్వంచలోని నవలిమిటెడ్ (నవభారత్) భారీ సాయం అందించింది. 1000 కుటుంబాలకు వంట సామగ్రి, దుప్పట్లను పంపిణీ చేసేందుకు కర్మాగారం నుంచి సామగ్రి తరలించు వాహనాలను బుధవారం నవలిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ లింగం వెంకట శరత్‌బాబు జెండాఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నవలిమిటెడ్ సహాయంగా ఖమ్మం వరద బాధితులకు వంట సామగ్రి, దుప్పట్లు అందచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజరు ఎంజీఎం ప్రసాద్, వైవి. శ్రీనివాస్, ఎస్. సురేష్ చంద్ర, ఎం. రత్నకిషోర్, బి. రామారావు, ఆర్‌పి కిరణ్, డిప్యూటి జనరల్ మేనేజరు ఎం. శంకరయ్య, శ్రీకాంత్, ఎన్. ప్రసాద్, అసిస్టెంట్ జనరల్ మేనేజరు ఎన్. సత్యనారాయణ, చీఫ్ లైజన్ ఆఫీసర్ వి. ఖాదరేంద్రబాబు, చీఫ్‌సెక్యూరిటీ ఆఫీసర్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ రఘునందన్‌రావుకు ఘన స్వాగతం


ఎంపీకి స్వాగతం పలుకుతున్న రంగా కిరణ్


లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబరు 11: మెదక్ ఎంపీ రఘునందనరావు కొత్తగూడేనికి సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. రఘునందనరావు కొత్తగూడెంలోని ఓల్డ్ డిపోకు చేరుకోవడంతో ఆయనకు పూలమాలలు, శాలువా కప్పి సత్కరించారు. అక్కడి నుంచి ద్విచక్రవాహనాల ర్యాలీలో ఆయన పాల్గొని ప్రజలకు అభివాదం చేసి ముందుకు సాగారు. బస్టాండ్ సెంటరులోని అమరవీరుల స్థూపం వద్దకు చేరుకుని అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి: ప్రిన్సిపాల్

మణుగూరు, సెప్టెంబర్ 11: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోకూడా రాణించాలని మణుగూరు ప్రభుత్వ డిగ్రీకాలేజి ప్రిన్సిపాల్ భద్రయ్య తెలిపారు. బుధవారం కాలేజిలో ప్రథమ సంవత్సరం చదివే పి పాండురాజు తెలంగాణా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఒలంపియాడ్‌లో 53 కేజీల విభాగంలో బెంచ్ ప్రెస్‌లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవడం అభినందనీయమన్నారు. కళాశాలలో విద్యార్థిని ఘనంగా సన్మానించారు. తనకున్న వైకల్యాన్ని అధిగమించి ఆత్మ విశ్వాసంతో పాండురాజు క్రీడల్లో రాణిస్తూ ప్రథమ స్థానంలో నిలవడం గర్వించదగ్గ విషయమన్నారు. ఇతర విద్యార్థులకు రాజు స్ఫూర్తిగా నిలిచాడని ప్రసంశించారు. కార్యక్రమంలో డాక్టర్ వాలియా, రమేష్‌బాబు, సతీష్, లక్ష్మణ్ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు

‘అమ్మఆదర్శ’ పనుల్లో నాణ్యత కరువు

» కురుస్తున్న భవనాలు, నెల రోజులకే మరమ్మతులు
» మొదటి విడతలో పూర్తికాని పనులు


కురుస్తున్న భవనం(ఇన్‌సెట్‌లో నీరు కారుతున్న దృశ్యం) (ఫైల్)

ఆళ్లపల్లి, సెప్టెంబరు 11: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్న లక్ష్యంతో ప్రవేశపెట్టిన అమ్మఆదర్శ పాఠశాల కార్యక్రమం అధికారుల పర్యవేక్షణ లోపంతో నీరుగారుతోంది. ఆళ్లపల్లి మండల వ్యాప్తంగా మొదటి విడతలో 14 పాఠశాలలు మరమ్మతుల కోసం అమ్మఆదర్శ పాఠశాల కింద ఎంపిక చేశారు. ఒక్కో పాఠశాలకు రూ. లక్ష నుంచి రూ.7లక్షలకు పైగా నిధులు కేటాయించారు. ఆయా పనులను గ్రామ వీవో అధ్యక్షులకు అప్పగించగా కొందరు స్వయంగా చేయగా, మరికొందరు ఇతరులకు అప్పగించారు. పనులు జరుగుతున్న సమయంలో వీవో కమిటి సభ్యులు, సంబంధిత అధికారులు, విద్యాశాఖ పర్యవేక్షణ లేకపోవడంతో నిర్వహకులు ఇష్టారాజ్యంగా పనులు చేసి చేతులు దులుపుకున్నట్టు విమర్శలున్నాయి.

మొదటి విడత అమ్మఆదర్శ పనుల్లో నేటికి పనులు పూర్తి కాలేదు. కొన్ని పాఠశాలల్లో భవనాలు పెచ్చులు ఊడిపోయి కురుస్తున్నాయి, మరుగుదొడ్లకు తలుపులు పెట్టిన వారం రోజుల్లోనే ఊడిపోయినవి, కొన్ని మరుగుదొడ్లు ఉపాధ్యాయుల తలకు తగులుతున్నాయి, నీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయలేదు, చేతులు, ప్లేట్లు శుభ్రం చేసుకునే నీటి కులాయిలపై విద్యార్థులు అసంతృప్తిగా ఉన్నారు. పాఠశాలపై భాగంలో మరమ్మతులు చేయకపోవడంతో భవనాల పైన స్విమింగ్‌పూల్‌లా, క్రింద గదుల లోపల కురుస్తున్నాయి. పాతూరు(రామానుజగూడెం) పాఠశాలలో మరుగుదొడ్డి స్లాబ్ నుంచి కారుతున్న నీరు విద్యుత్ బోర్డులోకి వెలుతుంది. అది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు చాలా ప్రమాదంగా మారింది.

విద్యార్థులు పాఠశాల నుంచి మరుగుదొడ్డి, చేతులు శుభ్రం చేసే నీటి బేషన్ దగ్గరకు వెళ్లాలి అంటే, సరైన ఫుట్‌పాత్ ఏర్పాటు చేయకపోవడంతో బురద, పిచ్చిమొక్కలతో దారి అధ్వానంగా ఉంది. మధ్యాహ్నం భోజన వర్కర్లకు వంటచేసేందుకు ఎక్కడ కూడా చిన్న షెడ్ ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. పాఠశాలలో చేయాల్సిన పనులు చేపట్టకపోవడం, చేసిన పనుల్లో నాణ్యత లేకపోవడంతో నెల రోజులకే విద్యార్థులకు శాపంగా మారింది. నేటికి మొదటి విడత అమ్మఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తి కాలేదంటే అధికారుల పర్యవేక్షణ ఎలా ఉందో చూస్తేనే అర్థం అవుతుందని విద్యార్థుల తల్లితండ్రులు ఆగ్రహిస్తున్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం


ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే తెల్లం

భద్రాచలం సెప్టెంబరు 11: ఇటీవల రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు అందుకున్న ఎస్‌జీటీ డి.ఉమాదేవిని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సన్మానించారు. భద్రాచలంలోని రంగనాయకులు గుట్టపై ఉన్న మండల ప్రజాపరిషత్ పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న ఉమాదేవిని బుధవారం ఎమ్మెల్యే భద్రాచలంలో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ దుమ్ముగూడేనికి చెందిన ఉపాధ్యాయిని ఉమాదేవి రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డును స్వీకరించటం ఎంతో గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో ఉప్పాడ ప్రసాద్‌రెడ్డి, వై.రోసిరెడ్డి పాల్గొన్నారు.

అటవీ అమరవీరులకు ఘన నివాళి


మణుగూరులో నివాళులర్పిస్తున్న అటవీ ఉద్యోగులు

మణుగూరు/ఇల్లెందుటౌన్, సెప్టెంబరు 11: తమ విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమర వీరులను గుర్తుకు చేసుకుంటూ బుధవారం జాతీయ అటవీ అమర వీరుల దినోత్సవాన్ని అటవీశాఖ అధికారులు సిబ్బంది నిర్వహించారు. మణుగూరులోని హనుమాన్ టెంపుల్ జంక్షన్ నుంచి ఓ ప్రదర్శనగా టీడీపీ సెంటర్‌కు చేరుకుని మానవహారాన్ని ఏర్పాటు చేశారు. అమరులైన వారికి నివాళ్లు అర్పించారు. మణుగూరు రేంజ్ అధికారి పి ఉపేంద్ర, సెక్షన్ అధికారి జీ సీతారాములు, కే లక్ష్మయ్య, పి నాగరాజు, ఎండి ముజీబుద్దీన్. రామచంద్రయ్య, బీట్ అధికారులు, బేస్ క్యాంపు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లెందు టౌన్: ఫారెస్ట్ అమరుల దినోత్సవం సందర్భంగా బుధవారం ఇల్లెందులో ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఫారెస్ట్ కార్యాలయం నుంచి పట్టణంలో సుభాష్‌నగర్ వరకు ద్విచక్రవాహనాల ర్యాలీ నిర్వహించారు. ఫారెస్ట్ ఇల్లెందు డివిజన్ పరిధిలోని కాచనపల్లి, గుండాల, కొమరారం రేంజ్‌పరిధిలోని అధికారులు, సిబ్బంది అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఫారెస్ట్ అమరుల త్యాగాన్ని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీవో వెంకన్నతో పాటు ఎఫ్ఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్వనూరు ముంపు వాసులకు వితరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


నిత్యావసరాలు అందజేస్తున్న లయన్స్‌క్లబ్

పాల్వంచ రూరల్, సెప్టెంబరు 11: పాల్వంచ మండలంలోని ఉల్వనూరు గ్రామం ముంపునకు గురై దీనవస్థలు పడుతున్న బాధిత కుటుంబాలపై బుధవారం ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురితమైన ‘నిల్వనీడలేక ముంపు వాసుల దీనావస్థలు’ అనే కథనంపై లయన్స్‌క్లబ్ వైద్యులు, లయన్స్‌క్లబ్ వైద్యులు పలువురు స్పందించారు. ఉల్వనూరు గ్రామానికి వెళ్లి వారి పరిస్థితిని చూసి వెంటనే 54 గృహాలు కోల్పోయిన వారికి బియ్యం, పలు రకాల నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ముంపు వాసుల బాధితులతో మాట్లాడారు. గ్రామంలో అంటు వ్యాధులు, జ్వరాల బారిన పడిన వారికి ఉచితంగా వైద్యసేవలు అందిస్తామని వైద్యులు చెప్పారు. అనారోగ్యానికి గురైన వారు తమ వైద్యశాలలో ఉచితంగా వైద్యం చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వసుందర్, బాలయ్య, కోర శ్రీ, కమల, స్టాప్‌నర్సులు పాల్గొన్నారు.

ప్రకృతిమిత్ర ఫౌండేషన్, పాత్రికేయుల సహాయం

ఉల్వనూరులో ముంపువాసులకు ప్రకృతిమిత్ర ఫౌండేషన్, పాత్రికేయులు సంయుక్త ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముడు మిత్రమిత్ర చౌహన్, పాత్రికేయులు సందీప్, నజీర్, మహేష్, రవి, భద్రం, ఎం. జగదీష్, ప్రజాపంథా నాయకులు నిమ్మల రాంబాబు, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

ఈపీ ఫిట్టర్లు శ్రమ దోపిడికి పాల్పడుతున్నారు

●టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు వెంకట్ ఆరోపణ

మణుగూరు, సెప్టెంబరు 11: మణుగూరు ఏరియాలో కొందరు అధికారులు ఈపీ ఫిట్టర్ల శ్రమ దోపిడికి పాల్పడుతున్నారని తెలంగాణ బొగ్గు గని కార్మికసంఘం ఉపాధ్యక్షులు వెంకట్ బుధవారం ఆరోపించారు. ఏ, బి గ్రేడ్ ఫిట్టర్లు చేయల్సిన పనులను సీ గేడుకు చెందిన వారితో చేపిస్తూ వారికి యాక్టింగ్ భత్యం కూడా ఇవ్వడం లేదన్నారు. చేంజ్ ఆఫ్ జాబ్ ట్రైనింగ్ లేకుండా భారీ యంత్రాలను కూడా రిపేర్లు చేయించడం మణుగూరునే కన్పిస్తోందన్నారు. రేపటి రోజున ఏప్రమాదం జరిగినా ఏరియా తో పాటు సంస్థ ప్రతిష్ఠకు కూడా భంగం వాటిల్లు తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ఇలాంటి పనులకు పాల్పడే అధికారులు తమ ప్రవర్తనలో మార్పులు తెచ్చుకొవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్‌కుమార్, మస్తాన్, వినయ్ కుమార్, బుత్తుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలతో సత్‌సంబంధాలు: సీపీఐ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు 11: విద్యార్థుల్లో సత్ సంబంధాలకు గణేష్ ఉత్సవాలు దోహదపడతాయని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా అన్నారు. బుధవారం కొత్తగూడెం మెడికల్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. వైద్య విద్యార్థులు గణేష్ ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్, ప్రొఫెసర్లు, మున్సిపల్ కౌన్సిలర్ భూక్యా శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటినుంచి మండల స్థాయి క్రీడాపోటీలు

జూలూరుపాడు, సెప్టెంబరు 11 : 68వ మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు గురు, శుక్రవారాలు రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు క్రీడల కన్వీనర్ లక్ష్మీనర్సయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీఈవో ఆదేశాల మేరకు గురువారం అండర్-14, అండర్ -17 విభాగాల్ల బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్,13న బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

భవిత కేంద్రానికి రూ. 17.50 లక్షల మంజూరు

● ఎమ్మెల్యే జారేను మర్యాదపూర్వకంగా కలిసిన డీఈవో వెంకటాచారి


ఎమ్మెల్యే ఆదినారాయణకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఈవో

దమ్మపేట, సెప్టెంబర్ 11 : వికలాంగుల సౌకర్యం కోసం భవిత కేంద్రం ఏర్పాటుకు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ రూ. 17.50 లక్షలు మంజూరుచేశారు. గండుగులపల్లిలోని క్యాంపు కార్యాలయంలో డీఈవో వెంకటాచారి బుధవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈసందర్భంగా నియోజకవర్గంలో పాఠశాలల్లో జరుగుతున్న విద్యాబోధన పై పాఠశాలల్లో వున్న సమస్యలపై డీఈవో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళారు .అదేవిధంగా నియోజకవర్గ భవిత కేంద్రం ఏర్పాటుపై సమస్య ఏమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్ళగా వెంటనే స్పందించిన ఆయన కలెక్టర్‌తో మాట్లాడి ఎస్‌డిఎఫ్ నిధుల నుండి ఎమ్మెల్యే నిధులు మంజూరు చేసారు. భవిత కేంద్రాన్ని మందలపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ను కలిసిన వారిలో ఎంఈవో లక్ష్మి, సెక్టోరియల్ అధికారి సైదులు ఉపాధ్యాయులు కలిసారు.

ఆధునిక హంగులతో క్రీడా ప్రాంగణ నిర్మాణం: ఎమ్మెల్యే

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 11: అశ్వారావుపేటలో ఆధునిక హంగులతో క్రీడా ప్రాంగణాన్ని చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంలోని జంగారెడ్డిగూడెం రోడ్‌లో ఇటీవలే ప్రభుత్వం మంజూరు చేసిన ఇండోర్ స్టేడియం నిర్మాణ నమూనాపై బుధవారం అధికారులతో చర్చించారు. క్రీడా ప్రాంగణ ఆవరణలోనే అధికారులతో నిర్మాణంపై చర్చించారు. ఇప్పటికే అన్ని అనుమతులు రావటం, నమూనా తయారుకావటంతో పీఆర్ అధికారులతో చర్చించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ ఇండోర్ స్టేడియం ఆధునిక పరిజ్ఞానంతో నాణ్యతా ప్రమాణాలు పాటించి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.కార్యక్రమంలో పీఆర్ డీఈఈ శ్రీధర్, ఏఈ అక్షిత, డిప్యూటీ స్పోర్ట్స్ ఆథారిటి అధికారి పరంధామ్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌తో పాటు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తా: ఎమ్మెల్యే వెంకట్రావ్

దుమ్ముగూడెం సెప్టెంబరు 11: లక్ష్మీనగరం సీఎస్‌ఐ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు హామీ ఇచ్చారు. గ్రామస్థుల అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే పాఠశాలను బుధవారం సందర్శించారు. తామంతా కలిసి విరాళాలు పోగేసి పాఠశాలలోని మౌలిక సదుపాయాల కల్పనకు చేస్తున్న కృషిని గ్రామస్థులు ఎమ్మెల్యేకు వివరించారు. ‘అమ్మ-ఆదర్శ’ నిధులతో పాఠశాలను అభివృద్ధి చేసేందుకు సహకరించాలని కోరగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

పాల్వంచ, సెప్టెంబరు 11: ప్రతి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో చేరిన ప్రతి విద్యార్థి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి నేషనల్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా ప్లానింగ్ కో-ఆర్డినేటర్ సతీష్ కుమార్ ఆదేశించారు. బుధవారం పాల్వంచ బొల్లోరిగూడెం ఉన్నత పాఠశాలలో పట్టణ, మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన యూడీఐ ప్లస్‌పై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం విద్యాశాఖ యూడైస్ ప్లస్‌ను ప్రవేశపెట్టి దేశంలో చదువుతున్న విద్యార్థులందరికీ ఒక యూనిక్ కోడ్, పిన్ నెంబర్‌ను కేటాయించిందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి విద్యార్థినీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అదే విధంగా ఆయా పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల వివరాలు, తరగతి గదులు, విద్యార్థుల వసతులు తదితర అన్ని వివరాలను యూడైస్ ప్లస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ ఛైర్మన్ మాధవరావు, మండల నోడల్ ఆఫీసర్ ప్రకాశరావు, ఆర్‌పీ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఐద్వా నూతన కమిటీ ఎన్నిక

ఇల్లెందు టౌన్, సెప్టెంబరు 11: ప్రజాతంత్ర మహిళా సమాఖ్య ఇల్లెందు మండల నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మునిగంటి లక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఆలేటి సంధ్యలను ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ మహిళల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పని చేస్తున్నట్లు తెలిపారు.

కోలాహలంగా నిమజ్జనాలు

» మండపాల వద్ద ప్రత్యేక పూజలు, అన్నదానాలు, గణపతి హోమం

భద్రాచలం, సెప్టెంబరు 11: భద్రాచలంలో గణేష్ నిమజ్జనాలు బుధవారం రాత్రి జరిగాయి. వినాయక చవితిని పురస్కరించుకొని భక్తులచే పూజలందుకున్న గణనాదున్ని నిమజ్జనం చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భద్రాద్రికి తీసుకొచ్చారు. ఈ సమయంలో గోదావరి నది తీరంలో ముందుగా గణనాదునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పడవల ద్వారా గజ ఈతగాళ్ల సహకారంతో వాటిని గోదావరిలో నిమజ్జనం చేశారు. ఈ సమయంలో భద్రాచలం పంచాయతీ అధికారులు విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేశారు. అలాగే భక్తులు స్నానాలు చేసేందుకు షవర్లను సైతం ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అన్నదానాలు.. ఊరేగింపుల కోలాహలాలు

మణుగూరు: మణుగూరు పట్టణ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో కొలువు దీరిన గణపతులకు ఐదు రోజుల పాటు విశేష పూజలను అందించి ఐదో రోజు బుధవారం నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు. మణుగూరు పట్టణంలోని టీడీపీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విజయ విఘ్నేశ్వర స్వామి మండపం వద్ద మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మణుగూరు సీఐ సతీష్ కుమార్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అశోక్ నగర్, శ్రీశ్రీ నగర్, మేదర్‌బస్తీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద కూడా మహా అన్నదాన ప్రసాద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. నిర్వహించి నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాల్లో చిన్నారులు, యువత నృత్యా లు ఆద్యాంతం ఆకట్టుకునేలా సాగాయి.

గంగమ్మ ఒడికి గణనాథుడు

అశ్వారావుపేట రూరల్: మండలంలో అనేక గ్రామాల్లో ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్న గణనాధుడు గంగమ్మ బుధవారం రాత్రి గంగమ్మ ఒడికి చేరాడు. ఊరేగింపు అనంతరం సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

గణపతి మండపాల వద్ద గణపతి హోమం

పాల్వంచ టౌన్: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఐదోరోజు రాహుల్‌గాంధీనగర్ ఆదర్శ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ మండపం వద్ద, కాంట్రాక్టర్స్ కాలనీగణేష్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరసిద్ది వినాయక మండపాల్లో సామూహిక లక్ష్మిగణపతి హోమం నిర్వహించారు. బొల్లోరుగూడెం శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టి గణనాధుని మండపం వద్ద సుమారు 1000మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.




భద్రాచలంలో గోదావరిలో నిమజ్జనం చేస్తున్న దృశ్యం, మణుగూరులో వినాయకుని పూజలో సీఐ దంపతులు, అశ్వారావుపేటలో గణనాథుల ఊరేగింపు

సమస్యలపై అవగాహన లేకపోతే ఎలా?

» గ్రామాల్లోని ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడొద్దు » సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పాయం


పనుల పురోగతిపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం

గుండాల, సెప్టెంబరు 11: మండలంలోని సమస్యలపై అధికారులకు అవగాహన లేకపోతే అభివృద్ధి ఎలా జరుగుతుందని, సమీక్షా సమావేశాలకు సమస్యలపై అవగాన లేకుండా వచ్చిన అధికారులపై పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా పరిష్కరించాలని, తన దృష్టికి తీసుకురావాలని, అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలని అన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు ముందుగా పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శించారు. గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. 23 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వివిధ శాఖల అధికారులు సమస్యలపై, జరుగుతున్న అభివృద్ధి పనులపై నివేధికలు అందించాలని చెప్తుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మిషన్ భగీరథ అందని గ్రామాల్లో మరమ్మతులు పూర్తి చేసి వెంటనే తాగునీరు అందించాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీల్లో నెలకొన్న సమస్యలపై అంచనాలు తయారుచేసి నివేదిక అందజేయాలన్నారు. పోడు భూముల జోలికి ఫారెస్ట్ అధికారులు పోవద్దన్నారు. ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు అందజేసిన భూముల్లో రైతులు మోటర్లు వేసుకునేందుకు ఫారెస్ట్ అధికారులు సహకరించాలని సూచించారు. నత్తనడకన సాగుతున్న మన ఊరు మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు వేగవంతం చేయాలని ఆర్అండ్‌బీ ఏఈని ఆదేశించారు. ప్రతీ నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం బతుకమ్మ ఘాట్‌ను, చెరువు ఆక్రమణలను పరిశీలించారు.

ఆక్రమణలను తొలగించి బతుకమ్మ ఘాట్ నిర్మాణానికి ప్రణాళికలు పంపించాలని ఇరిగేషన్ ఏఈని ఆదేశించారు. కొమరారం వయా శెట్టిపల్లి మీదుగా గుండాలకు ఆర్టీసీ బస్సు తిరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధు, మండల ప్రత్యేక అధికారి ఖుర్షీద్, తహసీల్దార్ ఇమ్మానుయెల్, ఎంపీడీవో సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.